www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 8 | వెల రూ.5.00

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 7288825681

Published from: Karimnagar, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar
హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక : 306 | మంగళవారం | 6 మే, 2025

## సిబిల్ స్కోరే ఆధారం!



- రాజీవ్ యువ వికాసం కింద లబ్ధిదారుల ఎంపిక
- కసరత్తు మొదలు పెట్టిన ప్రభుత్వం

02

ఇంటికి వచ్చి ఉరేసుకుని యువతి బలవన్మరణం జగిత్యాల జిల్లాలో విషాదం

02

## నీట్ ర్యాంక్ రాదేమోనని

జగిత్యాల జిల్లాలోని చల్‌గల్ గ్రామానికి చెందిన జంగా పూజ(18) అనే విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. నీట్ పరీక్ష రాసిన ఆమె.. పేపర్‌ను క్రాస్ చెక్ చేసుకున్న తర్వాత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.





## గల్ఫ్‌లో ఉద్యోగం అంటూ ఎమ్మెల్యేకే టోకరా

ఎస్పీకి ఆది శ్రీనివాస్ ఫిర్యాదు

కన్సల్టెన్సీపై సుమోటోగా కేసు నమోదు

02



# ఎవరిపై సమరం!

### రూపాయి అప్పు కూడా పుట్టని పరిస్థితి

- రాజకీయ ఉచ్చులో సమిధలు కావద్దు
- సమరం కాదు.. సంయమనం కావాలి
- మీకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నాం
- కలిసి పనిచేస్తేనే రాష్ట్రానికి బలం
- ఉద్యోగ సంఘాల సమ్మె ప్రకటనలపై సీఎం రేవంత్ రెడ్డి

**ప్రజానావ, హైదరాబాద్:** ఖజానా అంతంత మాత్రంగానే ఉన్నా.. ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నామని, అందుకు ఉద్యోగులు సమరం చేస్తారా అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వంపై సమరమే అంటూ ఉద్యోగ సంఘాలు ప్రకటించడంపై సీఎం మండిపడ్డారు. మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకా సమరం చేస్తారని ప్రశ్నించారు. తనను కోసినా సరే.. వచ్చిన ఆదాయానికి మించి ఖర్చు చేయలేనని సీఎం స్పష్టం చేశారు. ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన తీవ్ర ఆవేదనతో మాట్లాడారు. ఇక సమరమే అని ఉద్యోగ సంఘాలు ప్రకటిస్తున్నాయి. మీ సమరం తెలంగాణ ప్రజలపైనా? మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకా?. కొన్ని రాజకీయ పార్టీలు మాపై ఆరోపణలు చేస్తున్నాయి. ఉచిత విద్యుత్ పేరుతో విద్యుత్ బకాయిలు పెట్టి వెళ్లారు. ప్రభుత్వం అంటే మేం ఒక్కరమే కాదు.. మనమంతా కలిస్తేనే ప్రభుత్వం. మనం పాలకులం కాదు.. సేవకులం. ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే సహకరించాల్సిన ఉద్యోగ సంఘాలే సమరం అంటున్నాయి. ప్రజలు కష్టాల్లో

మిగతా 2 లో



## ఉద్యోగ సంఘాలతో చర్చలేవీ

- కమిటీ నియమించినా చర్చలకు పిలవని మంత్రులు
- సీఎం వ్యాఖ్యలపై ఉద్యోగ సంఘాల నేతల వ్యాఖ్య

03



- మే 10 నుంచి 31 వరకు పోటీలపై ప్రత్యేక చర్యలు
- చారిత్రక ప్రాంతాల్లో పర్యటించే వారికి సదుపాయాలు
- అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి

02

## మిస్‌వరల్డ్ పోటీలకు పటిష్ట భద్రత

ఎక్కడా లోపం రాకుండా ఏర్పాట్లు

## తెలంగాణ రోడ్ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నా



- రోడ్డు కనెక్టివిటీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం
- రూ.3,900 కోట్ల విలువైన పనులకు ప్రారంభం
- నీటి సంరక్షణ పథకాలతో రైతులకు మేలు
- ఈ దశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి
- కాగజ్‌నగర్ వేదికగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

**కుమ్రంభీమ్ ఆసిఫాబాద్, మే 5:** తెలంగాణలో రోడ్ల అభివృద్ధి బాధ్యత తనదని.. అయితే నీటి సంరోణ ద్వారా భవిష్యత్ తరాలకు మనం నీటి నిల్వలు అందించాల్సి ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఈ బాధ్యతను స్వీకరించాలని మంత్రి కోమటిరెడ్డి ెంకట్ రెడ్డిని గడ్కరీ కోరారు. విదర్భ ప్రాంతంలో నీటి నిల్వల ప్రాజెక్టులు చేపట్టి విజయం సాధించామని అన్నారు. వ్యవసాయం, ఉపాధి, రవాణా, మౌలిక వసతులు అనే 4 అంశాలు దేశాభివృద్ధిని నిర్దేశిస్తాయన్నారు.

మిగతా 2లో

## అంబర్‌పేట, బీహెచ్ఈఎల్ ఫ్లైఓవర్లకు మోక్షం

4లో

## భూకంపం

పలు చోట్ల కంపించిన భూమి

రిక్టర్ స్కేలుపై 3.8 తీవ్రత

హడలెత్తిన ప్రజలు

తెలంగాణలో సోమవారం సాయంత్రం 6.45 గంటలకు స్వల్ప భూకంపం వచ్చింది. సాయంత్రం భూకంపం రావడంతో ఇండ్ల లోంచి ప్రజలు బయటకు పరుగులు తీశారు. భూకంపం రావడంతో ఇండ్లలోకి వెళ్లేందుకు జనం భయపడ్డారు. స్వల్పంగా భూమి కంపించి ఆగిపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఇండ్లలోంచి బయటకు వచ్చిన జనాలు భూకంపం గురించి చర్చించుకున్నారు.



02



## ఆర్టీసీ ఇప్పుడిప్పుడే గాడిలో పడుతోంది

- ఉద్యోగులను తీసుకున్నాం.. బస్సులు కొన్నాం
- అనేక బకాయిలు చెల్లించి మేలు చేశాం
- ఇప్పుడు సమ్మెతో మళ్లీ వెనకపడేయవద్దు
- కార్మిక సంఘాలకు మంత్రి పొన్నం సూచన

02

## బీఆర్ఎస్‌లో కుటుంబ కలహాలు

3లో



- హరీశ్‌రావు అన్‌ఫాలో చేసిన కేటీఆర్
- వైఎస్ బతికుంటే హరీశ్ కాంగ్రెస్‌లో ఉండేవారు
- ప్రభుత్వ విప్ ఆది సంచలన వ్యాఖ్యలు

### దుష్ప్రచారం ఆపండి

డైవర్షన్ పాలిటిక్స్‌చేయొద్దు.. హరీశ్‌రావు

## ఉగ్రదాడి మృతుడి భార్యపై ట్రోల్

- ఘాటుగా స్పందించిన మహిళా కమిషన్

పహల్గాం ఉగ్రదాడి మృతుడి భార్యను ట్రోల్ చేస్తున్నారు. దీనిపై జాతీయ మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఆమె సైద్ధాంతిక వ్యక్తీకరణను తప్పుపడుతూ ట్రోల్ చేయడం సరికాదని ఆ ట్రోలింగ్‌ను ఖండించింది.



04



## కుటుంబాన్ని కడతేర్చిన కలహాలు

- ఇద్దరు పిల్లలకు ఉరేసి.. తండ్రి ఆత్మహత్య
- ఐదు రోజుల క్రితమే అఘాయిత్యం
- సంగారెడ్డి జిల్లాలో ఘోర విషాదం

02

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



మొదటి పేజీ తరువాయి

ఉంటే అండగా ఉండాల్సిన బాధ్యత ఉద్యోగ సంఘాలపై లేదా.. సమస్య ఉంటే చర్చించుకుందాని ఉద్యోగ సంఘాలకు విజ్ఞప్తి చేస్తున్నా అని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని రాజకీయ పార్టీలు కుట్ర చేస్తున్నాయి. వారి కుట్రలో ఉద్యోగ సంఘాలు పావులుగా మారొద్దన్నారు. కొత్త కోరికలతో ధర్నాలు చేస్తే ఉన్న వ్యవస్థ కుప్పకూలుతుంది. ఉద్యోగ సంఘాలు బాధ్యత మరిస్తే సమాజం సహించదు. అప్పులు పుట్టినా ఏదైనా చేయొచ్చు. కానీ, ఎక్కడా అప్పు పుట్టట్లేదు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది.. స్వీయ నియంత్రణే పరిష్కారం. ప్రభుత్వం మన కుటుంబం.. కుటుంబం పరువును బజారున పడేయొద్దు. ఇప్పుడు కావాల్సింది సమరం కాదు.. సమయస్ఫూర్తి, సంయమనం. తెలంగాణను మళ్లీ కోతుల గుంపునకు అప్పగించొద్దు. నాతో కలిసి రండి.. తెలంగాణను అభివృద్ధి పథంలో తీసుకెళ్దామని రేవంత్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం హయాం లో సమయానికి జీతాలు రాకున్న నోరు విప్పలేదు.. ఇప్పుడు వాళ్ల అడగకముందే జీతాలు ఇస్తోన్న సమరం చేస్తామంటున్నారని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని కొన్ని రాజకీయ పార్టీలు కుట్ర చేస్తున్నాయని.. రాజకీయ పార్టీల కుట్రలో ఉద్యోగ సంఘాలు పావులుగా మారొద్దని సూచించారు.

# ఎవరిపై సమరం!



రాష్ట్రం పూర్తిగా దివాలా తీసిన స్థితిలో ఉందని.. ఒక్కరూపాయి కూడా అప్పు పుట్టడం లేదని.. బ్యాంకులకు వెళితే దొంగలను చూసినట్లు- చూస్తున్నారని అన్నారు. అణాపైసా చిక్కడం లేదని.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని చెప్పినా ఎవరూ నమ్మడం లేదన్నారు. కనీసం గ్రామాల్లో రోడ్లు వేయాలనే పరిస్థితి నెలకొందని.. స్వీయ నియంత్రణ మాత్రమే దీనికి పరిష్కారమని తెలిపారు. సరిహద్దుల్లో సైనికుల్లా తెలంగాణ పోలీసులు రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయి కాబట్టే.. తెలంగాణ రాష్ట్రం ప్రపంచస్థాయి పెట్టు-బడులను ఆకర్షించగలుగుతోందన్నారు. విధినిర్వహణలో చనిపోయిన పోలీసుల కుటు-ంబాలకు భరోసా ఇస్తున్నామని చెప్పారు. విధినిర్వహణలో మరణించిన ఐపీఎస్‌ల కుటుంబాలకు రూ.2 కోట్లు, అదనపు ఎస్పీ, ఎస్పీ కుటుంబాలకు రూ. కోటిన్నర ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. నేరం జరగకుండా నియంత్రించే బాధ్యత పోలీసులపై ఉందని చెప్పారు.



# సిబిల్ స్కోరే ఆధారం!

**ప్రజానావ, హైదరాబాద్:** రాజీవ్ యువవికాసం కింద అందించే రుణాలను జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా లబ్దిదారులకు రుణాల మంజూరు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకోసం ఈ నెలాఖరుకు లబ్దిదారుల జాబితాను అంటే అర్హుల జాబితాను సిద్ధం చేస్తున్నారు. మొదటి విడతలో సుమారు 5 లక్షల మందికి ఈ పథకం ప్రయోజనం అందించేలా చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బ్యాంకు రుణాలు పొందాలంటే సిబిల్ స్కోర్ బాగుండాలి. ఇప్పుడు రాజీవ్ యువ వికాసం స్కీమ్‌లో సిబిల్ స్కోర్ కీలకం కానుంది. పథకం ద్వారా ప్రభుత్వ సహాయంతో రుణం పొందాలనుకునే యువతకు క్రెడిట్ స్కోర్‌ను ప్రధాన అర్హతగా నిర్ణయించనున్నారు. దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్ తక్కువగా ఉంటే లేదా గతంలో రుణాలు తీసుకుని చెల్లించకపోతే వారి దరఖాస్తులను బ్యాంకులు తిరస్కరించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. రుణాల దరఖాస్తులకు ముందు సిబిల్ స్కోర్‌ను తప్పనిసరిగా పరిశీలించనున్న బ్యాంకులు, దానికి సంబంధించి ఫీజు కూడా వసూలు చేయనున్నాయి. ప్రతి దరఖాస్తుకు రూ.100 నుంచి రూ.200 వరకు వసూలు చేసే యోచనలో కొన్ని బ్యాంకులు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే కొన్ని బ్యాంకులు ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాయి. సిబిల్ స్కోర్ వసూలుపై ప్రభుత్వం స్పందించింది. తక్కువ ఆదాయ వర్గాల అభ్యర్థులపై భారం పడకుండా చూడాలనే ఉద్దేశంతో బ్యాంకులు వసూలు చేసే ఫీజును మినహాయించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ అంశాన్ని ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు నివేదించనున్నారు. స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కోసం భారీగా దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 16,25,441 దరఖాస్తులలో అత్యధికంగా బీసీల నుంచి 5,35,666, ఎస్సీల నుంచి 2,95,908, ఎస్టీల నుంచి 1,39,112, ఈబీసీల నుంచి 23,269, మైనారిటీల నుంచి 1,07,681, క్రిస్టియన్ మైనారిటీ-ల నుంచి 2,689 దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం మండల స్థాయి-ంలో దాదాపు 70 శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తయినట్టు అధికారులు తెలిపారు. తుది జాబితా మే నెలాఖరులో అందుబాటులోకి రానుంది. మండల అధికారులు పరిశీలించిన దరఖాస్తులను బ్యాంకులకు పంపించి అర్హుల ఎంపిక జరుగుతుంది. తుది జాబితా తయారైన తర్వాత అదే కలెక్టర్ల ద్వారా ప్రభుత్వానికి అందజేస్తారు.

# గల్ఫ్‌లో ఉద్యోగం అంటూ ఎమ్మెల్యేకే టోకరా

**ప్రజానావ, వేములవాడ:** ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ఓ మహిళ కాల్ చేసిన ఘటన హాట్ టాపిక్ గా మారింది. గల్ఫ్‌లో మంచి ఆఫర్ ఉందంటూ ఎమ్మెల్యేకు ఓ కన్సల్టెన్సీ మహిళ ఫోన్ చేసింది. నువ్వు ఎవ్వరికి ఫోన్ చేశావో తెలుసా అంటూ ఎమ్మెల్యే ఫైర్ అయ్యారు. ఎమ్మెల్యేతో మహిళ వాగ్వాదానికి దిగింది. మహిళ తీరుపై సదరు ఎమ్మెల్యే ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు లక్ష్మీ మ్యాన్ పవర్ కన్సల్టెన్సీపై జగిత్యాల పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. కన్సల్టెన్సీ మహిళ దుబాయ్, మలేషియా, సింగపూర్ వంటి దేశాల్లో మంచి ఆఫర్స్ ఉన్నాయంటూ పలువురికి ఫోన్ కాల్స్ చేసినట్లు పోలీసులు తెలిపారు. లక్ష్మీ మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ ఎలాంటి లైసెన్స్ లేకుండానే విదేశీ బ్రోకరేజీ కన్సల్టెన్సీగా పనిచేస్తున్నట్లు గుర్తించారు. వెంటనే ఆఫీస్ సీజ్ చేసి, లక్ష్మీ మ్యాన్ పవర్ కన్సల్టెన్సీపై కేసు నమోదు చేశారు.

# తెలంగాణలో భూకంపం

**ప్రజానావ, వేములవాడ:** తెలంగాణలోని పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం స్వల్ప భూకంపం వచ్చింది. రిక్టర్ స్కేలుపై 3.8 తీవ్రత నమోదైంది. సోమవారం సాయంత్రం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో భూమి ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. రెండు సెకన్ల పాటు భూమి కంపించడంతో ప్రజలు హడలెత్తారు. భూమి కంపించడంతో ప్రజలు ప్రాణ భయంతో పరుగులు తీశారు. ఉమ్మడి కరీంనగర్‌లోని సుల్తానాబాద్, వేములవాడ, జగిత్యాల, సిరిసిల్లతో పాటు నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్, కడెం, మంచిర్యాల జిల్లాలోని జన్నారంలో స్వల్పంగా కంపించింది. అనూహ్య పరిణామంతో హడలెత్తిన ప్రజలు ప్రాణభయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. భూకంపంపై స్పందించిన అధికారులు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచనలు చేశారు. సురక్షిత ప్రాంతాల్లో ఉండటం బెటర్ అని ఆదేశాలు జారీ చేశారు.



# మిస్‌వరల్డ్ పోటీలకు పటిష్ట భద్రత

**ప్రజానావ, హైదరాబాద్:** మిస్ వరల్డ్ 2025 పోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రపంచ వ్యాప్తంగా 116 దేశాలకు చెందిన యువతులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా వారికి ఆతిథ్యమివ్వాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. మే 10వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరిగే ప్రపంచస్థాయి పోటీల నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు- చేయాలని పోలీసు అధికారులను అప్రమత్తం చేశారు. తెలంగాణ ఖ్యాతిని విశ్వమంతటా పరిచయం చేసేందుకు ఉపయోగపడే మిస్ వరల్డ్ 2025 వేడుకలను ప్రతిష్మాత్మకంగా నిర్వహించాలని అన్నారు. పోటీదారులతో పాటు దేశ విదేశాల నుంచి ఈవెంట్ కవరేజీకి దాదాపు 3000 మంది మీడియా ప్రతినిధులు హాజరవుతారని అన్నారు. వివిధ దేశాల నుంచి పోటీలకు వచ్చే వారిని తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలతో స్వాగతించాలని, పోటీలు పూర్తయ్యేంత వరకు ఎక్కడా చిన్న పొరపాటు లేకుండా ఏర్పాట్లు ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను హెచ్చరించారు. పర్యాటక శాఖతో పాటు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని, అధికారులు అంతా సమర్థంగా తమకు అప్పగించిన బాధ్యతలు నిర్వహించాలని ఆదేశించారు. మిస్ వరల్డ్ 2025 ఏర్పాట్లపై సోమవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సీఎంతో పాటు మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, డీజీపీ జితేందర్, సిటీ- పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు, ఏడీజీపీ స్టీఫెన్ రవీంద్రతో పాటు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మే 10 నుంచి 31వ తేదీ వరకు వరుసగా జరిగే కార్యక్రమాల షెడ్యూలుకు అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు- చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రతి కార్యక్రమానికి ఒక నోడల్ ఆఫీసర్ ను నియమించాలని సూచించారు. మే 10వ తేదీన సాయంత్రం హైదరాబాద్ లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ ప్రారంభోత్సవం నుంచి 31వ తేదీన జరిగే గ్రాండ్ ఫినాలే వరకు ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. హైదరాబాద్ లోని చార్మినార్, లాడ్ బజార్‌తో పాటు- తెలంగాణ తల్లి, సెక్రెటేరియట్ తోపాటు- రాష్ట్రంలోని పలు పర్యాటక ప్రాంతాలను మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించనున్న నేపథ్యంలో అవసరమైన రవాణా, వసతులు కల్పించాలన్నారు. అక్కడ భద్రత కట్టు-దిట్టంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనుకోని అవాంఛనీయ పరిస్థితులు తలెత్తినా వాటిని అధిగమించే ప్రత్యామ్నాయ ప్రణాళికలను అధికారులు రూపొందించుకోవాలని ఆదేశించారు. మహిళా సాధికారతను చాటిచెప్పేలా రాష్ట్రంలో ఐకేపీ మహిళలు నిర్వహిస్తున్న డ్వాక్రా బజార్ సందర్శనతో పాటు, ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ సెమీఫైనల్స్ తిలకించేందుకు అవసరమైన ఏర్పాట్లు- చేయాలన్నారు. హైదరాబాద్ లో మిస్ వరల్డ్ కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్తు అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాతావరణ సూచనలకు అనుగుణంగా తగిన ముందస్తు ఏర్పాట్లు- చేసుకోవాలని, ఈదురు గాలులు, వర్షాలు వచ్చినా గ్రేటర్ సిటీ- పరిధిలో ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్ఎంసీతో పాటు- హైడ్రా విభాగాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మిస్ వరల్డ్ కు వచ్చే విదేశీ అతిథులు బస చేసే హోటళ్లతో పాటు- గచ్చిబౌలి స్టేడియం, చార్మినార్, లాడ్ బజార్, చౌమహల్లా ప్యాలెస్, సెక్రెటేరియట్ పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రజా ప్రతినిధులతో పాటు- వివిధ రంగాల్లో ప్రముఖులను ప్రభుత్వం తరఫున మిస్ వరల్డ్ 2025 ప్రారంభోత్సవానికి ఆహ్వానించాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ గురుకులాలు, బీసీ, ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు, కస్తూరిబా పాఠశాలలకు చెందిన విద్యార్థులను కూడా ఒకరోజు మిస్ వరల్డ్ వేడుకలు చూపించాలని ముఖ్యమంత్రి చెప్పారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు- చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వేడుకలు జరిగే రోజుల్లో హైదరాబాద్ అంతటా మిస్ వరల్డ్ సందడి కనిపించేలా తోరణాలు, లైటింగ్, హోర్డింగ్ లతో పాటు- సిటీ-లోని ముఖ్యమైన జంక్షన్లు, చారిత్రక ప్రదేశాలను అందంగా అలంకరించాలని అన్నారు.

# నీట్ ర్యాంక్ రాదేమోనని

## ఇంటికి వచ్చి ఉరేసుకుని యువతి ఆత్మహత్య



**ప్రజానావ, జగిత్యాల:** జిల్లాలోని చల్‌గల్ గ్రామానికి చెందిన జంగాపూజ(18) అనే విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. నీట్ పరీక్ష రాసిన ఆమె.. పేపర్ ను క్రాస్ చెక్ చేసుకున్న తర్వాత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రెండేళ్ల క్రితం రాసిన నీట్ పరీక్షలో ర్యాంకు రాకపోవడంతో రెండోసారి తాజాగా నీట్ పరీక్ష రాసింది. అయితే ఇంటికి వచ్చిన తర్వాత పేపర్ ను క్రాస్ చెక్ చేసుకుని ర్యాంకు రాదనే ఆందోళనలో పడింది. ఈ క్రమంలోనే ఆత్మహత్య చేసుకుంది. జగిత్యాల జిల్లాలోని రెండు కేంద్రాల్లో నిర్వహించిన నీట్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. నాచుపల్లి జేఎన్టీయూ కేంద్రాన్ని కలెక్టర్ సత్యప్రసాద్ తనిఖీ చేశారు. అక్కడి అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థులు ఇబ్బందులు లేకుండా పరీక్ష రాసేలా చర్యలు తీసుకున్నట్లు- తెలిపారు. జిల్లాలోని ఒక సెంటర్‌లో 480, రెండో సెంటర్లో 278 మంది పరీక్ష రాశారని పేర్కొన్నారు. ఒక కేంద్రంలో 13 మంది, మరో కేంద్రంలో ఐదుగురు గైర్హాజరైనట్లు- వివరించారు. ఇకపోతే జేఎన్టీయూ పరీక్ష కేంద్రం తెలియక మూడు నిమిషాలు ఆలస్యంగా చేరుకున్న ఓ విద్యార్థిని పరీక్ష దూరమైంది. మల్లాపూర్ మండలం వీవీ.రావుపేటకు చెందిన సీహెచ్.నవ్యకు జేఎన్టీయూ కేంద్రం పడింది. దీంతో ఆమె కుటు-ంబ సభ్యులతో కలిసి బయల్దేరింది. ఇంజినీరింగ్ కళాశాల అడ్రస్‌పై అవగాహన లేక దిగువ కొండగట్టు- వరకు వెళ్లారు. పూర్తి అడ్రస్ తెలుసుకుని వెళ్లే సరికి మూడు నిమిషాలు ఆలస్యం కావడంతో అక్కడున్న సిబ్బంది లోపలికి అనుమతించలేదు. గతంలో లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకున్నా.. ఆశించిన ఫలితం రాలేదని, మరోసారి పరీక్షకు సన్నద్ధమైన రాయలేకపోయాయని ఆవేదనతో తిరిగి వెళ్లిపోయింది.

# కుటుంబాన్ని కడతేర్చిన కలహాలు

**ప్రజానావ, సంగారెడ్డి:** క్షణికావేశం కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతోంది. కలహాల కారణంగా కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. జీవితాలు అర్థాంతరంగా ముగిసిపోతున్నాయి. తాజాగా సంగారెడ్డి జిల్లాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. కుటుంబ కలహాలతో ఇద్దరు పిల్లలకు ఉరి వేసి తాను ఉరివేసుకుని తండ్రి సుభాష్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఐదు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో ఇంటి ఓనర్ కి స్థానికులు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకుని డోర్ పగలగొట్టి చూడగా కుళ్లిపోయిన స్థితిలో మృతదేహాలు లభ్యమయ్యాయి. భార్య మంజు(35) కి వేరొకరితో వివాహేతర సంబంధం ఉన్నట్టు సమాచారం. ఈ కారణంతో గత కొన్ని రోజులుగా ఇద్దరి మధ్య గొడవలు జరుగు తున్నాయని అరోపణపలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో పిల్లలతో కలిసి సుభాష్(40) ఉంటున్నాడు. మానసిక వేదనకు గురైన సుభాష్ చనిపోవాలని నిర్ణయించుకున్నాడు. కుమారుడు రిథిక్ మర్యాన్(09), కుమార్తె ఆరా(05)కి ఉరివేసి...అనంతరం ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డు. ముగ్గురి మరణంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఆర్టీసీ ఇప్పుడిప్పుడే గాడిలో పడుతోంది

**ప్రజానావ, హైదరాబాద్:** కేసీఆర్ ప్రభుత్వంలో ఆర్టీసీని నిర్వీర్యం చేశారని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. గత పది సంవత్సరాలుగా ఒక్క బస్సు కొనుగోలు చేయలేదని ,ఒక్క ఉద్యోగం కూడా నియామకం చేయలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో సీసీఎస్, పీఎఫ్ పైసలు వాడుకున్నారని విమర్శించారు. ఇప్పుడిప్పుడే ఆర్టీసి గాడితో పడుతున్న సమయంలో ఆర్టీసీ సమ్మె ప్రతిపాదన సరికాదని అన్నారు. సోమవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ని ఆర్టీసీ సంఘాల నేతలు కలిశారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ని కలిసిన వారిలో ఆర్టీసీ జేఏసీ చైర్మన్ టీఎంయూ జనరల్ సెక్రెటరీ అశ్వద్ధామరెడ్డి, ఎన్ఎంయూ జనరల్ సెక్రెటరీ నరేందర్, కార్మిక సంఘ్ జనరల్ సెక్రెటరీ ఎర్ర స్వామి కుమార్ , ఎస్టీఎంయూ జనరల్ సెక్రెటరీ పున్న హరికృష్ణ, తదితరులు ఉన్నారు. ఆర్టీసీ సమస్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి ఆర్టీసీ సంఘాల నేతలు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఆర్టీసీ సమస్యలపై ఉద్యోగులు ఎప్పుడైనా తనను కలవవచ్చుని.. వారికి తానేప్పుడు అందుబాటులోనే ఉంటానని స్పష్టం చేశారు. ఆర్టీసీ సమస్యలు పరిష్కరించడానికి తాను, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నామని అన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల కోసం తమ కార్యాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం , ప్రయాణికుల సౌకర్యం ఈ మూడింటికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని.. సమస్యలు పరిష్కారమవుతున్నాయని చెప్పారు. సమ్మె చేయొద్దని ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. తమ ప్రభుత్వంలో ఆర్టీసీ అభివృద్ధి కోసం 16 నెలలుగా ఎన్నో మంచి కార్యక్రమాలు చేశామని.. ఒక్కరినైనా ఇబ్బంది పెట్టలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె చేస్తే ప్రజలు ఇబ్బందులు పడతారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. టీజీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు 2013 నుంచి చెల్లించాల్సిన బాండ్ రూ.400 కోట్లు చెల్లించామని తెలిపారు. 2017 ప్రకారం పే స్కేల్ 21 శాతం ఇచ్చామని..సంవత్సరానికి రూ.412 కోట్ల భారం తమ ప్రభుత్వంపై పడుతోందని చెప్పారు. పీఎఫ్ ఆర్గనైజేషన్ సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రూ.1039 కోట్లు చెల్లించామని వెల్లడించారు. నెలవారీ పీఎఫ్ కంట్రిబ్యూషన్ జనవరి-2024 నుంచి క్రమం తప్పకుండా చెల్లిస్తున్నామని తెలిపారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సీసీఎస్ బకాయిలు ఉద్యోగులకు రూ. 345 కోట్లు- చెల్లించామని అన్నారు. 1500 మందిని కారుణ్య నియామకాల కింద విధుల్లోకి తీసుకున్నామని వివరించారు. తమ ప్రభుత్వం టీజీఎస్ ఆర్టీసీలో 3038 మంది ఉద్యోగులను నియమించనుందని చెప్పారు. కొత్త బస్సులు కొనుగోలు చేశామని, తార్నాక ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీగా మార్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఆర్టీసి కార్మికులు సమ్మెకు పిలుపునివ్వడంతో స్పందించిన మంత్రి పొన్నం.. సమ్మె చేయొద్దని, చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఆర్టీసి సమస్యలను ఎప్పుడైనా ప్రభుత్వం దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. సమస్యలు వినడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని చెప్పారు. ఆర్టీసి పరిరక్షణ, కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి పొన్నం తెలిపారు.కాగా, తెలంగాణ వ్యాప్తంగా మే 7 నుండి ఆర్టీసి కార్మికుల నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చిన సంగతి తెలసిందే. ఆర్టీసి పరిరక్షణ, విలీన పక్రియ పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ.. మే 6 అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ బస్సులు బంద్ కానున్నట్లు కార్మికులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరిపేందుకు ప్రయత్నిస్తోంది.



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
మంగళవారం
6 మే 2025


# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మరణాలు

- ఇవన్నీ ప్రభుత్వ హత్యగా గుర్తించాలి
- ముందుకు సాగని ధాన్యం కొనుగోళ్లు
- అకాల వర్షాలతో తడిసిన ధాన్యం కొనాలి
- ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శలు



**ప్రజానావ, సిద్దిపేట:** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న రైతు మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ఈ మరణాలకు ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి బాధ్యులని అన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేం దుకు రైతు మహోత్సవాలు నిర్వహించడం సిగ్గు చేటుని విమర్శించారు. సిద్దిపేట మార్కెట్ యార్డులో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని సోమవారం నాడు హరీశ్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను పరామ ర్శించిన అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఈ ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ, అన్న దాతల ఆవేదనపై లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. అందాల పోటీలపై పోటీపడి సమీక్షలు నిర్వహిస్తున్న నాయకులకు, కొనుగోలు కేంద్రాల్లోనే కుప్పకూలుతున్న రైతున్నల గుండె కోత వినిపించడం లేదా? అని ప్రశ్నించారు.సాగునీళ్లు అందించడంలో, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో, కొనుగోలుచేసిన ధాన్యానికి డబ్బులు చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ కూడా ధాన్యం కొనలేదని.. రోజుల తరబడి ధాన్యం కొనుగోలు కోసం ఎదురుచూస్తూ రైతులు దయనీయ పరిస్థితిలో ఉన్నారని హరీశ్‌రావు తెలిపారు. ధాన్యం కుప్పలపైన ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 15న జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం దూలూరు వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో జలపతిరెడ్డి అనే రైతు మృతి చెందాడని, ఏప్రిల్ 21న మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చెర్లపాలెం ధాన్యం కొనుగోలు కేంద్రంలో హనుమండ్ల ప్రేమలత అనే మహిళా రైతు హఠాన్మరణం చెందిందని, ఏప్రిల్ 22న మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మదనతుర్తి కొనుగోలు కేంద్రంలో బిర్రు వెంకన్న ప్రాణాలు కోల్పోయాడని, ఏప్రిల్ 26న సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు కొనుగోలు కేంద్రంలో ధాన్యం నేర్పుతూ చింతకింది హనుమయ్య కుప్పకూలాడని తెలిపారు. ధాన్యపు రాశులే సాక్ష్యంగా, కొనుగోలు కేంద్రాల్లోనే జరుగుతున్న ఈ రైతు మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే అని ఆరోపించారు. ఇవి సహజ మరణాలు కావు, ముమ్మాటికీ కాంగ్రెస్ నిర్లక్ష్యంతో జరిగినవే అని స్పష్టం చేశారు. అందాల పోటీల మీద ఉన్న శ్రద్ధ ఈ ప్రభుత్వానికి రైతుల మీద లేదని విమర్శించారు. అందాల పోటీలు అన్నం పెడతాయా అని ప్రశ్నించారు. దేశంలో అత్యధిక పంట పండిందని గొప్పలు చెప్పడం కాదని.. రైతుల బాధలు పట్టించుకోవాలని హరీష్ రావు ప్రభుత్వాన్ని కోరారు. పత్తి రైతులకు జరిగిన అన్యాయంపై సీబీఐ చేత విచారణ జరపాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. 48 గంటల్లో వడ్ల పైసలు ఇస్తున్నామని చెబుతున్న మంత్రి నిరూపిస్తారా అని సవాల్ చేశారు. పది రోజులలోపు పైసలు రాడమే లేదన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేల ఇన్పుట్ సబ్సిడీ అందించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ఈఈఒ అధికారులతో కలిసి పత్తి రైతులను ముంచి 3500 కోట్ల కుంభకోణం చేశారని ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీ ప్రశ్నించిన తర్వాత విజిలెన్స్ ఎంక్వయిరీ వేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. సీఎం సహా, రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నా పాలకుల్లో మాత్రం ఎలాంటి చలనం లేదని మండిపడ్డారు.



## ప్రధాని కార్యాలయానికి రాహుల్ గాంధీ

### సీబీఐ డైరెక్టర్ ఎంపికపై భేటీ

**న్యూఢిల్లీ, మే 5:** ప్రధానమంత్రి నరేంద్రమోదీతో కాంగ్రెస్ అగ్రనేత, పార్లమెంట్లో విపక్ష నేత రాహుల్ గాంధీ భేటీ అయ్యారు. ప్రధాని మోదీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ప్రధానంగా సీబీఐ డైరెక్టర్ ఎంపికపై చర్చ జరిగినట్టు తెలుస్తోంది. అటు, పహల్గాం దాడికి సంబంధించి పాకిస్థాన్‌తో అనుసరించాల్సిన విషయాలపై కూడా వీరిద్దరి మధ్య చర్చ జరిగినట్టు సమాచారం. వీటితో పాటు పలు కీలక అంశాలు కూడా ఇరువురు నేతల మధ్య చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. సోమవారం సాయంత్రం రాహల్ ప్రధాని కార్యాలయానికి వెళ్లారు. కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కొత్త చీఫ్‌ని ఎంపిక చేసేందుకు నిర్వహించిన భేటీలో ఆయన పాల్గొన్నారు. ప్రధాని కార్యాలయంలో నిర్వహించిన ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన సీబీఐ డైరెక్టర్ నియామక కమిటీ సమావేశానికి రాహుల్‌తో పాటు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా హాజరయ్యారు. ప్రస్తుత సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ పదవీ కాలం మే 25న ముగియనున్న తరుణంలో కొత్త చీఫ్ ఎంపికపై చర్చించినట్లు– తెలుస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల నియామక కమిటీలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ సిఫారసు మేరకు కేంద్ర ప్రభుత్వం సీబీఐ డైరెక్టర్ నియామకాన్ని చేపడుతుంది.

## నక్సల్స్‌తో చర్చల ప్రసక్తి లేదు

### తుపాకీ చేతపట్టిన వారితో చర్చలేమిటి

### కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టీకరణ

**ప్రజానావ, పెద్దపల్లి:** మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరిపే ప్రసక్తే లేదనే విషయాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ మరోసారి స్పష్టం చేశారు. ఈ మేరకు రామగుండంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. తుపాకీ చేతపట్టి అమాయకులను చంపుతుంటే చర్చలేంటని సంజయ్ ప్రశ్నించారు. ఆ చావులకు మీరేం సమాధానం చెబుతారంటూ బండి సంజయ్ ఎదురు ప్రశ్నించారు. కాంగ్రెస్ రెండు నాల్కల ధోరణి ప్రదర్శిస్తోంది. మావోయిస్టులు దశాబ్దాలుగా అమాయకులను కాల్చి చంపిన సంగతి గుర్తు లేదా?, మావోయిస్టుల సానుభూతి పరులు సాధించిందేంటని అన్నారు. వారిపై నిషేధం విధించింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా అని అన్నారు. మావోయిస్టులు ఎవరున్నా తుపాకీ వీడి లొంగిపోవాల్సిందే.. జన జీవన స్రవంతిలో కలవాల్సిందే. పౌర హక్కుల సంఘం నేతలారా.. నక్సల్స్ నచ్చజెప్పండని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఇక తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది కులగణన కానేకాదన్నారు. కేవలం సర్వే మాత్రమే జరిగిందన్నారు. ఇక్కడ బీసీలకు తీవ్రమైన అన్యాయం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చేసింది కులగణన కానేకాదన్నారు. ప్రతి ఇంటికి కచ్చితంగా వెళ్లి నిర్వహించేది కులగణన అని అన్నారు. జనగణన మాదిరిగానే మోదీ ప్రభుత్వం కులగణన చేస్తుందన్నారు. బీసీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతామన్నారు బండి సంజయ్.

## బీఆర్ఎస్‌లో కుటుంబ కలహాలు

### హరీశ్‌ను అన్‌ఫాలో చేసిన కేటీఆర్

### వైఎస్ బతికుంటే హరీశ్ కాంగ్రెస్‌లో ఉండేవారు

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు



**ప్రజానావ, హైదరాబాద్:** మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబంపై ఆది శ్రీనివాస్ షాకింగ్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్‌లో కుటుంబ కలహాలు ఉన్నాయని.. తాము ఎప్పటి నుంచో చెబుతున్నామని అన్నారు. హరీష్‌రావును సోషల్ మీడియాలో కేటీఆర్ అన్ ఫాలో చేశారని తెలిపారు. ఆ పార్టీలో గ్రూప్ తగాదాలు తారాస్థాయికి చేరాయని ఆరోపించారు. బీఆర్ఎస్‌లో కుర్చీ పంచాయితీ నడుస్తోందని విమర్శించారు. ఒక వైపు కవిత, మరో వైపు కేటీఆర్, ఇంకోక వైపు హరీష్‌రావు ఇలా గ్రూప్ తగాదా నడుస్తుందని ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం) సీఎల్పీ మీడియా పాయింట్‌లో ఆది శ్రీనివాస్ మాట్లాడారు. హరీష్‌రావు కాంగ్రెస్‌లోకి రావడానికి గతంలో ప్రయత్నం చేశారని గుర్తుచేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి బతికి ఉంటే హరీష్‌రావు ఇప్పటికి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేవారని తెలిపారు. హరీష్‌రావు కాంగ్రెస్‌లోకి వచ్చే విషయంపై ఏమైనా ఉంటే అధిష్ఠానం చూసుకుంటుందని అన్నారు. బీఆర్ఎస్‌లో హరీష్‌రావు ప్రాముఖ్యం తగ్గిపోయిందని ఆది శ్రీనివాస్ తెలిపారు. బీసీ కులగణన కాంగ్రెస్ పేటెంట్ అని ఆది శ్రీనివాస్ ఉద్ఘాటించారు. గతంలో ప్రతీ పేద వాడికి ఏది కావాలో గుర్తించి కాంగ్రెస్ అందించిందని తెలిపారు. కులగణనపై ఎన్నో ఏళ్లుగా డిమాండ్ ఉందని.. దానిని తమ ప్రభుత్వం పూర్తి చేసిందని అన్నారు. కుల గణనపై బీజేపీ ఏనాడూ నోరు విప్పలేదని చెప్పారు. తాము కులగణన చేసిన తర్వాత బీజేపీ దిగి వచ్చిందని అన్నారు. బడుగు, బలహీన వర్గాలు కాంగ్రెస్ వైపు చూస్తుండటంతో బీజేపీ కుయుక్తులు చేస్తోందని విమర్శలు చేశారు. తెలంగాణలో కులగణన కాదు, సర్వే చేశారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అంటు–న్నారని అన్నారు. ఈ రెండింటికి తేడా ఏంటని ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. రేపు బీజేపీ ప్రభుత్వం చేసేది కూడా ఇదే కదా.. కులగణన చేసేది ఈ అధికారులే కదా అని ఆది శ్రీనివాస్ నిలదీశారు. సర్వే, కుల గణన చేసినా కులం మారదు కదా అని ప్రశ్నించారు. బీసీల పట్ల బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే వెంటనే కులగణన ప్రారంభించి కట్ ఆఫ్ డేట్ పెట్టి పూర్తి చేసి రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన డిమాండ్‌కు కేంద్ర ప్రభుత్వం తలొగ్గిందని చెప్పారు. ఈ రోజు దేశవ్యాప్తంగా బీసీలు ఒక్కటవుతున్నారని అన్నారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగిన బీసీ ధర్నాకు 17 రాజకీయ పార్టీలు హాజరైతే.. బీజేపీ, బీఆర్ఎస్‌లు దూరంగా ఉన్నాయని మండిపడ్డారు. బీసీల పట్ల ఈ రెండు పార్టీల చిత్తశుద్ధి ఏంటో తెలుస్తోందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

## దుష్ప్రచారం ఆపండి

### డైవర్షన్‌పాలిటిక్స్‌చేయొద్దు ● మాజీమంత్రి హరీశ్ రావు

**ప్రజానావ, హైదరాబాద్:** తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై ట్విట్టర్ వేదికగా మాజీమంత్రి హరీష్ రావు స్పందించారు. కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఈ సందర్భంగా ఆయన.. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆపాలని అన్నారు. కాంగ్రెస్ చెప్పింది చేయడంలో విఫలమై, ఇప్పుడు ఏం చేయాలో అర్థం కాక.. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా మాపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అబద్దాలను బయటపెట్టడమే గాక దుష్ప్రచారం చేస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకునేలా చేస్తామని హెచ్చరిస్తూ.. దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటు అని హరీష్ రావు వ్యాఖ్యానించారు.



## ఉద్యోగ సంఘాలతో చర్చలేవీ

### కమిటీ నియమించినా చర్చలకు పిలవని మంత్రులు

### సిఎం వ్యాఖ్యలపై ఉద్యోగ సంఘాల నేతల వ్యాఖ్య

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు తమ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా సబ్ కమిటీ ఏర్పాటైనప్పటికీ, ఏడు నెలలు గడిచినా ఒక్క సమావేశం కూడా నిర్వహించకపోవడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు జగదీశ్వర్ మాట్లాడుతూ.. ఉద్యోగ సంఘాలకు ఎన్నో సమస్యలు ఉన్నాయి., సీఎం రేవంత్ రెడ్డి చర్చకు రావాలని పిలిచారు.. కానీ మంత్రులు మాత్రం చర్చకు సమయం కేటాయించడం లేదని అన్నారు. గత ప్రభుత్వం విజ్ఞప్తులకు స్పందించకపోవడం వాస్తవమే. ఆర్థిక సమస్యలు పక్కన పెట్టినప్పటికీ, విధానపరమైన నిర్ణయం తీసుకోవాలి. మేము సమరం కాదు, ఉద్యమం చేస్తున్నాం. మంత్రుల కోసం గంటల తరబడి ఎదురుచూస్తున్నాం. అడగొద్దు అంటే అడగం. మేమే కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చాం అని ఆయన పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి ముజీబ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి అంటే గౌరవం. మీరు తండ్రి పాత్రలో ఉన్నారు. మీరు ఇచ్చిన గంట సమయం మాకు విలువైనది. కానీ, మిగిలిన మంత్రులు మాత్రం మాట్లాడటం లేదు. ప్రజలపై యుద్ధం చేయాలని మేము కోరడం లేదు. సబ్ కమిటీ– అనే మీ ఏర్పాటు– చేసిన బృందం అసలు మాట్లాడటానికి ముందుకు రావడంలేదు. సీఎం చెప్పినట్లే, కొంతమంది సంఘాల నేతలు ప్రభుత్వంతో కుమ్మక్కు అయ్యారు. వాళ్లు ఇప్పుడు ఎక్కడ ఉన్నారో చూడండి. ప్రభుత్వానికి డబ్బుల్లేవన్న విషయాన్ని మేము అర్థం చేసుకోగలం. కానీ, మాతో మాట్లాడి సమస్య పరిష్కారం చేయండి. కోట్ల రూపాయలు అడగడం లేదని ఆయన అన్నారు. మొత్తంగా ఉద్యోగ సంఘాలు ప్రభుత్వంపై తమ అంచనాలను స్పష్టంగా తెలియజేస్తూ సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

## ఆర్టీసీ కార్మికులక సమ్మె కవాతు

### సమ్మె యధాతథంగా కొనసాగుతుందని వెల్లడి

**ప్రజానావ, హైదరాబాద్:** ఆర్టీసీ కార్మికులు సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో సోమవారం వారు కవాతు నిర్వహించారు. హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్దనున్న బస్ భవన్‌ను ఆర్టీసీ కార్మికులు సోమవారం ముట్టడించారు. దీంతో బస్ భవన్ వద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. సమ్మె యధావిధిగా కొనసాగుతోందని ఆర్టీసీ జేఏసీ ఈ సందర్భంగా ప్రకటించింది. సమ్మె నేపథ్యంలో తమతో చర్చలకు ఆర్టీసీ యాజమాన్యం పిలవకపోవడంపై జేఏసీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి బస్సులు ఎక్కడివక్కడ నిలిచిపోతాయని చెప్పారు. తమ సమ్మెకు సహకరించాలని ఈ సందర్భంగా ప్రజలకు వారు విజ్ఞప్తి చేశారు. మే 7వ తేదీ నుంచి తాము తలపెట్టిన సమ్మె యధావిధిగా కొనసాగుతుందని జేఏసీ నేతలు స్పష్టం చేశారు. కార్మికుల కవాతు నేపథ్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో పోలీసులు మోహరించారు. మరోవైపు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. ఆదివారం ఆర్టీసీ కార్మిక నేతలతో సమావేశమయ్యారు. సమ్మెను ఉప సంహ రించుకోవాలని వారికి ఆయన సూచించారు. ఆర్టీసీ సంస్థ ఇప్పుడే లాభాల బాట పడు తోందని వారికి వివరించారు. అంతేకాకుండా.. రేవంత్ రెడ్డి సర్కార్ కొలువు తీరిన అనంతరం ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం చేపట్టిన వివరాలను వారికి ఆయన సోదాహరణగా వివరించారు. అయితే ఆర్టీసీ జేఏసీ నేతలు మాత్రం తమ సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోమని స్పష్టం చేశారు. ఆ క్రమంలో ఆర్టీసీ కార్మికులు సోమవారం కవాతు నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ ముఖ్య కార్యాలయం బస్ భవన్‌ను వారు ముట్టడించారు. దీంతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి. మే 7వ తేదీ నుంచి తాము సమ్మెకు వెళ్తున్నట్లు తెలంగాణ ఆర్టీసీ జేఏసీ ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులోభాగంగా ఏప్రిల్ 27వ తేదీన అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆర్టీసీ జేఏసీ విడుదల చేసింది. మేడే స్ఫూర్తితో తాము ఈ సమ్మెకు సిద్దమయ్యామంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి.. తమ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జేఏసీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా పలు డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి జేఏసీ తీసుకువెళ్లింది.

## హైదరాబాద్‌లో పలుచోట్ల వర్షం

**ప్రజానావ, హైదరాబాద్:** హైదరాబాద్‌లో సోమవారం రాత్రి సమయానికి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రాత్రి 8.30 నుంచి నెమ్మదిగా ప్రారంభమైన వాన జోరందుకుంది. ఫలితంగా నగరంలోని అనేక ప్రాంతాల్లో భారీగా వాన కురిసింది. మిన్ను విరిగి మీద పడ్డట్టు–గా ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. బంజారాహిల్స్, మణికొండ, మెహదీపట్నం, హైటెక్ సిటీ–, అబిడ్స్, కోఠి, బషీర్ బాగ్ ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. బంజారాహిల్స్, ఎమ్మెల్యే కాలనీ, కృష్ణానగర్ ప్రాంతాల్లో కూడా చిరుజల్లులు కురిశాయి. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లో భారీగానే వర్షం పడింది

## హైదరాబాద్ చేరుకుంటున్న సుందరీమణులు

### ఘనంగా స్వాగతిస్తున్న ప్రభుత్వం

**ప్రజానావ, హైదరాబాద్:** మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాలకు చెందిన కంటెస్టెంట్స్ హైదరాబాద్ చేరుకుంటున్నారు. సోమవారం పోర్చుగల్, ఘనా, ఐర్లాండ్ దేశాలకు చెందిన ప్రతినిధులు శంషాబాద్ చేరుకున్నారు. వీరికి పూర్తి సంప్రదాయ లాంఛనాలతో పర్యాటక శాఖ స్వాగతం పలికింది. స్వాగత సత్కారాలతో పాటు–, భద్రత, వసతికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు. పోర్చుగల్ కు చెందిన మారియా అమెలియా ఆంటోనియో, ఘనా నుంచి జుట్టా అమా పోకుహా అడ్డో, ఐర్లాండ్ కు చెందిన జాస్మిన్ జెర్హార్డ్ లు హైదరాబాద్ చేరుకున్నారు. ఇప్పటికే,మిస్ సౌత్ ఆఫ్రికా జోయలైజ్ జన్సెన్ వాన్ రెన్స్ బర్గ్ , మిస్ బ్రెజిల్ జెస్సికా స్కెన్డ్రియుజ్య్ పెడ్రోసో, మిస్ వరల్డ్ సీఈవో, చైర్ పర్సన్ జూలియా ఈవేలిన్ మోర్లి, మిస్ కెనడా మిస్ ఎమ్మా డయన్నా క్యాథరీన్ మొర్రిసన్ లు ఇప్పటికే చేరుకున్నారు. ఈనెల 10న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగే ప్రారంభ కార్యక్రమంపై మిస్ వరల్డ్ చైర్ పర్సన్ జూలియా మోర్లీ సన్నాహక, సమన్వయ కార్యక్రమాలను ప్రభుత్వ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు.





## సంపాదకీయం



# సమగ్ర పంటల బీమాపై ఆలోచన చేయండి!

అకాల వర్షాలు మరోమారు తెలుగు రాష్ట్రాల రైతులను దెబ్బతీసాయి. పంటచేతికొచ్చే సమయంలో పంటలు దెబ్బతినడంతో పంటలు నేలకొరిగాయి. రైతులు పెట్టిన పెట్టుబడులు రాక.. అప్పుల్లో కూరుకు పోతున్నారు. ఏలా ఇది జరుగుతున్న తంతే. వరి, బొప్పాయి, మామిడి, మక్కజొన్న తదితర పంటలు ఇలా దెబ్బతింటున్నాయి. అన్నదాతల పంటలసాగు జూదంలా మారింది. పంటలు దండిగా పండితే మద్దతు ధరలు ఇవ్వరు. పంటలు చేతికొస్తాయనుకుంటే వడగళ్లకు నేలరాలుతున్నాయి. ఈ పరిస్థితుల్లో నష్ట పరిహారం కూడా ప్రహసనంగా మారింది. అధికారులు రావాలి..అంచనాలు వేయాలి...తరవాత అరకొ సాయం అందుతుంది. కొందరికి అదికూడా అందదు. ఇంతటి దౌర్భాగ్యంలో రైతులు ఉన్నా.. ఊరడించే పాలకులు సకాలంలో సాయం చేసే చర్యలు తీసుకోరు. నిజానికి సమగ్ర పంటలబీమా పథకాన్ని ప్రవేశ పెట్టాలి. ప్రీమియం ప్రభుత్వాలే కట్టుకుంటే..రైతులకు పంటనష్టపోయినప్పుడు నూటికనూరు శాతం నష్ట పరిహారం వచ్చేలా చేయాలి. అప్పుడు అన్నదాత నిశ్చితంగా పంటలు సాగుచేస్తారు. సమగ్ర పంటల బీమాతో రైతులను ఆదుకునేలా ప్రణాళికలను అత్యవసరంగా సిద్ధం చేయాల్సి ఉంది. మనిషికి, పశువులకు, వాహనాలకు, ఇళ్లకు బీమా చేస్తున్న పద్ధతిలోనే పంటల బీమాకు కూడా ప్రణాళిక చేయాల్సి ఉంది. ఇకపోతే ఏటా పంటల బీమా పథకాలపై రైతులకు అవగాహన కల్పించి.. వారంతా ప్రీమియం చెల్లించేలా ప్రోత్సహిం చడంలో వ్యవసాయ శాఖ అధికారులు విఫలమవుతున్నారు. దీంతో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వారికి పరిహారం అందడం లేదు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. రైతులను చైతన్యం చేయించి వారితో నామమాత్రంగా బీమా సొమ్ము చెల్లించేలా చేయించడంలో అధికారులు విఫలం అవుతున్నారు. వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకుని రావడం, దాని అనుబంధ రంగాలను ప్రోత్సహించడం వల్ల ఒక్కో రైతు కనీసం వందమందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి కల్పించవచ్చు. దీంతో ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరగడంతో పాటు, ఎగుమతులకు అవకాశాలు పెరుగతాయి. విదేశీ మారక నిల్వలను సాధించవచ్చు. ఈ సూత్రాన్ని గతంలో ఉన్న ఏ ప్రభుత్వం పాటించడం లేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కూడా పాటించడం లేదు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రకటించిన మోడీ వారి పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు. కేవలం విదేశీ పెట్టుబడులే సర్వస్వం అన్న విధంగా నేతలంతా ఆయా దేశాల ముందు మోకరిల్లుతున్నాయి. కానీ ఏనాడు రైతులకు ఒక్క పైసా విదిల్చడం లేదు. గిట్టుబాటు ధరలు, పంటలకు బీమా తదితర అంశాలను పట్టించుకోవడం లేదు. రైతులు ఆందోళన చేసినా ప్రభుత్వం కదలడం లేదు. పంటల బీమా విధిగా అమలు జరిగేలా చర్యలు తీసుకుంటే రైతులను ఆదుకున్న వారు అవుతారు. ఇందుకు జాతీయ స్థాయిలో సమగ్ర బీమా పథకం అమలు చేయాలి. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన సందర్భాల్లో బీమా వర్తించేలా చూడాలి. పంటనష్ట పోయిన రైతులు ప్రభుత్వం చుట్టూ కాళ్లరిగేలా లేదా..బిచ్చమెత్తుకునే ఉండే పరిస్థితులు పోవాలి. బీమా సొమ్ము దర్జాగా రాబట్టుకునేలా చట్టాలు రావాలి. అప్పుడే అన్నదాత కంటినిండా నిద్రపోగలడు. ప్రధానంగా బీమా పథకాల వల్ల కలిగే లబ్దిపై వారికి సమాచారం ఉండడం లేదు. అకాల వర్షాలు, వడగళ్లు, తుఫాన్లు సంభవిస్తే జరిగే నష్టాలను పొందేలా సమగ్ర బీమా పథకం రూపొందించాల్సిన బాధ్యత కేంద్రానిది. కానీ ఇలా చేయలేకపోతున్నారు. అలాగే ఏ పంటకు ఎంత చెల్లించాలన్న సమాచారం కూడా రైతులకు చేరడం లేదు. అలాగే పథకాల అమలుపై రైతుల్లో చైతన్యం కానరావడం లేదు. వడగళ్లు, విలయం సంభవించి నప్పుడు ప్రభుత్వాలపై ఆధారపడి పరిహారం అందక లబోదిబోమంటున్నారు. దీనిని తప్పించేందుకు ఫసల్ బీమా వంటి పథకాలు అందుబాటులో ఉన్నాయి. రైతులను చైతన్యం చేయకపోవడం వల్ల ఆశించిన స్థాయిలో బీమాకు నోచుకోవడం లేదని తెలుస్తోంది. గతంలో కనీసం ఇందులో పది శాతం మంది కూడ బీమా ప్రయోజనాలు పొందలేకపోయారు. వేల మంది రైతులు బీమా ప్రీమియం చెల్లించలేదని సమాచారం. క్షేత్రస్థాయిలో అధికారులు తగిన రీతిలో రైతులకు బీమా సమాచారాన్ని చేరవేయక పోవడంతోనే బీమాకు దూరమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై విస్తృత ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉంది. ప్రధానమంత్రి పంటల బీమా పథకంలో ఖరీఫ్, యాసంగి పంటల బీమా ప్రీమియం ధరలు ఎప్పుడు ఎలా చెల్లించాలో గ్రామాల వారిగా వ్యవసాయాధికారులు దండోరా వేసి రైతుల దృష్టికి తీసుకుని రావాలి. బీమా పథకంలో వరి, మొక్కజొన్న, వేరుశనగ, శనగ పంటలతో పాటు మామిడి తోటలను చేర్చారు. పత్తికి వాతావరణ ఆధారిత బీమా, సోయాబీన్‌కు గ్రామం యూనిట్, జొన్న, కంది, పెసర, మినుము తదితర పంటలకు మండలం యూనిట్‌గా పంట బీమా అమలు చేయాల్సి ఉంది. దీనికితోడు టమాట, మామిడి పంటలకు కూడా వాతావరణ బీమాను ప్రకటించడం వల్ల రైతులకు ఊరట కలగనుంది. పంటల వారీగా ప్రీమియం ధరలు, చెల్లించాల్సిన గడువు తేదీల వివరాలతో కూడిన మార్గదర్శ కాలను ప్రభుత్వం విడుదల చేయడంతో పాటు రైతులకు తెలియచేయాలి. ఎన్ని హెక్టార్లలో ఏ విధమైన పంటలను రైతులు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేయాలి. ఏ పంట సాగు విస్తీర్ణం ఎలా ఉంటుందన్నది సీజన్‌కు ముందే కానుంది. ప్రధానమంత్రి పంటల బీమా పథకం కింద వరి, మొక్క జొన్న, వేరుశనగ, శనగ పంటలకు వాతావరణ ఆధారిత బీమా పథకంలో భాగంగా మామిడి పంటలకు బీమా వర్తిస్తుంది. పంట రుణాలను పొందాలనుకున్న రైతులకు సంబంధించి రుణం అందజేసే సమయంలోనే ప్రీమియాన్ని తీసుకుని మిగతా మొత్తాన్ని సదరు రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. ప్రధానమంత్రి పంటల బీమా పథకానికి సంబంధించి ఎలాంటి సందేహాలున్నా ఏఈవోలు, ఏవోలను సంప్రదించేలా క్షేత్రస్థాయిలో రైతులకు తెలియచేయాలి. పంట రుణాలు తీసుకోని రైతులు నేరుగా ప్రీమియం చెల్లించుకునే వెసులుబాటు ఉంది. మీ సేవా కేంద్రాలు, బ్యాంకులు తదితర వాటి ద్వారా చెల్లించవచ్చు. ఇవన్నీ గ్రామస్థాయిలో ప్రచారం జరగాలి. అప్పుడే పంటలకు తగిన భరోసా దక్కుతుంది. మిర్చి,పత్తి,శనగ తదితర రైతులు నష్టం సంభవించి నప్పుడు ఏ విధంగా పరిహారం పొందవచ్చో గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు చేయాలి. విదేశీ పారిశ్రామిక వేత్తలను కాళ్లావేళ్లాపడుతూ వారి ప్రాపకం కోసం పాకులాడే రోజులు పోయేలా రైతులు స్వయం సమృద్ది సాధించాలి. అప్పుడే దేశంలో రైతులకు భరోసా దక్కుతుంది. దీనిని అత్యవసర విషయంగా గుర్తించి రాష్ట్రాలు కూడా ప్రణాళికలు సిద్దం చేసి కేంద్రంతో చర్చిస్తే మంచిది.

# తెలంగాణ రోడ్ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నా

## కాగజ్‌నగర్ వేదికగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



**ప్రజానావ, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్:** తెలంగాణలో రోడ్ల అభివృద్ధి బాధ్యత తనదని.. అయితే నీటి సంరోణ ద్వారా భవిష్యత్ తరాలకు మనం నీటి నిల్వలు అందించాల్సి ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఈ బాధ్యతను స్వీకరించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని మంత్రి గడ్కరీ కోరారు. విదర్భ ప్రాంతంలో నీటి నిల్వల ప్రాజెక్టులు చేపట్టి విజయం సాధించామని అన్నారు. వ్యవసాయం, ఉపాధి, రవాణా, మౌలిక వసతులు అనే 4 అంశాలు దేశాభివృద్ధిని నిర్దేశిస్తాయన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని తెలిపారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో సభావేదికపై నుంచి జాతీయ రహదారులను ఆయన ప్రారంభించారు. రూ.3,900 కోట్ల విలువైన పనులను మొదలుపెట్టి మాట్లాడారు.ఈ సందర్భంగా ఇక్కడ ఏర్పాటు- చేసిన బహిరంగ సభా వేదిక పైనుంచే 7 జాతీయరహదారులు ప్రారంభించారు. ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేక చరిత్ర ఉందని, భూమికోసం, భుక్తి కోసం.. జిల్లా ప్రజలు ఎన్నో పోరాటాలు చేశారని, ఆదిలాబాద్ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిందని, ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. చీకటి ఉండే చోట వెలుగులు నింపాలని, తనకు 13 డాక్టరేట్లు ఉన్నాయని.. తాను ఇంజనీరును కానని, అయినా 13 డాక్టరేట్లు ఉన్నాయని నితిన్ గడ్కరీ చెప్పారు. ఇక్కడి ప్రజల సమస్యలు అర్థం చేసుకునే రోజు వచ్చిందని అన్నారు. పీఎం సడక్ యోజన కింద దేశవ్యాప్తంగా రోడ్లు నిర్మిస్తోందని, రోడ్లు బాగున్న దేశాన్నే అభివృద్ధి చెందిన దేశంగా భావిస్తారని అన్నారు. భద్రాద్రి, బాసర, మేడారం ఆధ్యాత్మిక క్షేత్రాలు హైవేతో అనుసంధానం చేస్తామని చెప్పారు. సూర్యాపేట నుంచి దేవరపల్లి వరకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మిస్తామన్నారు. నాగపూర్ నుంచి విజయవాడ కారిడార్ నిర్మాణాన్ని చేపట్టినట్లు- తెలిపారు. జగిత్యాల- కరీంనగర్ హైవే విస్తరణ వేగవంతం చేస్తామని, వ్యవసాయం, ఉపాధి, రవాణా, మౌలిక వసతులే దేశాభివృద్ధి అని అన్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం పీఎం సడక్ యోజన కింద దేశవ్యాప్తంగా రోడ్లు నిర్మిస్తోందని చెప్పారు. రహదారులు మెరుగ్గా ఉండే దేశాన్నే అభివృద్ధి చెందిన దేశంగా భావిస్తారని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేక చరిత్ర ఉందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఈ సందర్భంగా అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం ఎన్నో పోరాటాలు చేసిన ఆదివాసీల జిల్లా ఇది అని కొనియాడారు. రాష్ట్రాల మధ్య అనుసంధానం పెంచేందుకు కీలకమైన ప్రాజెక్టును కేంద్రం చేపట్టింది. రోడ్డు కనెక్టివిటీలో భాగంగా క్లిష్టమైన వంతెనలు, సొరంగ మార్గాలు నిర్మిస్తున్నాం. జోజిలా పాస్ టన్నెల్ వంటి నిర్మాణాలను చేపట్టాం. సూర్యాపేట నుంచి దేవరపల్లి వరకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మించనున్నాం. నాగపూర్ నుంచి విజయవాడ కారిడార్ చేపట్టాం. తెలంగాణ-మహారాష్ట్ర మధ్య రోడ్డు కనెక్టివిటీ మరింత పెరగనుంది. భద్రాచలం, బాసర, మేడారం వంటి ఆధ్యాత్మిక క్షేత్రాలను జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తాం. జగిత్యాల-కరీంనగర్ హైవే విస్తరణ పనులను త్వరలోనే చేపడతాం. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య తగ్గించేందుకు ఎన్నో ప్రాజెక్టులు చేపట్టాం. అంబర్‌పేట్‌లో నిర్మించిన పైవంతెనను ఇవాళే ప్రారంభించుకోనున్నాం. కాలుష్య నియంత్రణలో భాగంగా ఎలక్ట్రిక్, సీఎన్‌జీ వాహనాలను ప్రోత్సహిస్తున్నాం. పెట్రోల్ వాహనాలకు బదులుగా విద్యుత్ వాహనాలు ఇంకా పెరగాలి. వీటితో రవాణా ఖర్చు బాగా తగ్గుతుందని నితిన్ గడ్కరీ తెలిపారు. స్మార్ట్ సిటీలు కాదు...స్మార్ట్ విలేజ్‌లను తీర్చి దిద్దుతున్నామని చెప్పారు. వచ్చే నాలుగేళ్లలో తెలంగాణలో రెండులక్షల కోట్లు ఖర్చు చేస్తామన్నారు. గ్రీన్ ఎనర్జీ కోసం రాబోయే రోజుల్లో లక్ష కోట్లు- ఖర్చు చేస్తామని చెప్పారు. గడ్చిరోలీ జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. రైతులు ఆత్మహత్యచేసుకున్న విదర్భలో తాము పనిచేశామని చెప్పారు. చీకటి ఉండే చోట వెలుగులు నింపాలన్నారు. వెనుకబడిన జిల్లాలో అభివృద్ధి కోసం మేం పనిచేస్తున్నాం. అమృత్ సరోవర్ పేరుతో నీటి నిల్వలు పెంచుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే మేం నీటి నిల్వలు పెంచేందుకు సిద్ధం. తెలంగాణలో కూడా అలా నీటి సరస్సులను గుర్తిస్తే మేం అభివృద్ధి చేస్తాం అని గడ్కరీ హామీ ఇచ్చారు. మీ సమస్యలను అర్థం చేసుకునే అవకాశం వచ్చింది. రోడ్డు బాగుంటేనే అమెరికా ధనిక దేశం అయింది. తెలంగాణలో కూడా రోడ్లు బాగుంటేనే ధనిక రాష్ట్రం అవుతుందన్నారు. నీరు, ఇంధనం, రవాణా, కమ్యునికేషన్, ఏఐతో ఏ ప్రదేశమైనా అభివృద్ధి జరుగుతోంది. .శ్రీనగర్, జమ్మూలో36 టన్నెల్స్ నిర్మిస్తున్నాం. ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం, ఆర్‌ఎస్‌ఎస్ లో ఉన్నప్పుడు ఆదివాసీలతో కలిసి పనిచేశాం. యువకులకు ఉద్యోగాలు, రైతులకు మద్దతు ధర దక్కాలి. జగిత్యాల వరంగల్ హైవేకు రూ.1000 కోట్లు- కేటాయించాం అని నితిన్ గడ్కరీ అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు, బండి సంజయ్, కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, ఎంపీ గోడం నగేశ్, వంశీ, ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, పాల్వాయి హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ చొరబాటు దారుడి పట్టివేత

**న్యూఢిల్లీ, మే 5:** భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు యత్నించిన ఓ పాకిస్థానీ యువకుడిని బోర్డర్ సెక్యూరిటీ- ఫోర్స్ తాజాగా అరెస్టు చేసింది. మే 3 రాత్రి సమయంలో పాక్ యువకుడు హుస్‌నెయిన్ పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లా మీదుగా భారత్‌లోకి చొరబడేందుకు యత్నించి భద్రతాదళాలకు దొరికిపోయాడు. నిందితుడు పాక్‌లోని గుజ్రన్‌వాలా జిల్లాకు చెందినవాడిగా పోలీసులు గుర్తించారు. సరిహద్దు వెంబడి250 మీటర్ల మేర భారత్ భూభాగంలోకి వచ్చిన సమయంలో అతడిని భద్రతాదళాలు గుర్తించాయి. సందీప్ ఘోష్ ఆ ప్రాంతంలో అనుమానాస్పద కదలికలను గుర్తించి వెంటనే కంపెనీ కమాండర్‌కు సమాచారం అందించారు. వెంటనే క్విక్ రెస్పాన్స్ టీం అక్కడకు చేరుకుని ఆ ప్రాంతం మొత్తాన్ని తమ అధీనంలోకి తీసుకుంది. రాత్రి 11.45 సమయంలో నిందితుడిని అదుపులోకి తీసుకుంది. అంతర్జాతీయ సరిహద్దు, బీఎస్‌ఎఫ్ సరిహద్దు కంచె మధ్య ఉన్న పొదల్లో దాక్కున్న అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద 40 పాకిస్థానీ రూపాయలతో పాటు-, పాక్ జాతీయ ఐడెంటిటీ- కార్డును కూడా గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకున్నాక బీఎస్‌ఎఫ్ సిబ్బంది పంజాబ్ పోలీసులకు అప్పగించారు. మే3న అదుపులోకి తీసుకున్నట్టు- రికార్డుల్లో నమోదు చేశారు. ఇంటె-లిజెన్స్ వర్గాలకు కూడా ఈ విషయమై సమాచారం అందించారు. ఘటన నేపథ్యంలో భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. సరిహద్దు వద్ద గస్తీ పెంచాయి.

# మాక్ డ్రిల్‌లు నిర్వహించండి

## రాష్ట్రాలకు మొంశాఖ ఆదేశాలు

**న్యూఢిల్లీ, మే 5:** పాకిస్తాన్‌తోఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ దేశంలోని అన్ని రాష్ట్రాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. శత్రు దాడి జరిగినప్పుడు సంసిద్ధంగా ఉండేందుకు మే 7 నుంచి పౌర రక్షణ మాక్ డ్రిల్‌లు నిర్వహించాలని సూచించినట్లు- ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మాక్ డ్రిల్ ద్వారా వైమానిక దాడుల సైరన్‌లను పరీక్షించడం, పౌరులు, విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం, బ్లాక్‌అవుట్ చర్యలను అమలు చేయడం వంటి మొదలైన కీలక కార్యకలాపాలు నిర్వహిస్తారు. దాయాది దేశంతో ఉద్రిక్తలు పెరుగుతుండటంతో దేశంలో వైమానిక దాడులపై అవగాహన పెంచేందుకు మాక్ డ్రిల్ నిర్వహించాలని కేంద్ర హోం శాఖ రాష్ట్రాలను ఆదేశించింది. దేశవ్యాప్తంగా ఉన్న స్థానిక అధికారులు, విద్యా సంస్థలు, పౌరులకు ఎమర్జెన్సీ వేళల్లో ఎలా స్పందించాలో అవగాహన కల్పించాలని నొక్కి చెప్పింది. శత్రుదేశాలు దాడి చేస్తే ఎలా స్పందించాలి.. అత్యవసర పరిస్థితుల్లో తమను తాము ఎలా కాపాడుకోవాలో మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు శిక్షణ ఇస్తారు. క్రాష్ బ్లాక్‌అవుట్ చర్యలు కూడా ఉంటాయి.

# ఉగ్రదాడి మృతుడి భార్యపై ట్రోల్

## ఘాటుగా స్పందించిన మహిళా కమిషన్



**న్యూఢిల్లీ, మే 5:** పహల్గాం ఉగ్రదాడి మృతుడి భార్యను నెట్టింట్లో ట్రోల్ చేస్తున్నారు. దీనిపై జాతీయ మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఆమె సైద్ధాంతిక వ్యక్తీకరణను తప్పుపడుతూ ట్రోల్ చేయడం సరికాదని ఆ ట్రోలింగ్‌ను ఖండించింది. ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడి ఘటనలో మృతి చెందినవారిలో నేవీ అధికారి లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఒక వర్గం వారిని టార్గెట్ చేసేలా వ్యాఖ్యలు చేయొద్దంటూ ఆయన సతీమణి హిమాన్ని విజ్ఞప్తి చేశారు. ఇది కొందరు నెటిజన్లకు రుచించలేదు. దాంతో ఆమెను విమర్శిస్తూ ట్రోల్ చేయడం మొదలుపెట్టారు. ఆమెను ఉద్దేశించి కామెంట్లు- చేయడం ఏమాత్రం తగదని, దీనిపై కేంద్రం స్పందించాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ తరుణంలోనే మహిళా కమిషన్ నుంచి స్పందన వచ్చింది. పహల్గాం ఉగ్రదాడిలో ఎన్నో కుటుంబాలకు తీరనిలోటు ఏర్పడింది. లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్‌ను కూడా మతం పేరు అడిగి, ప్రాణాలు తీశారు. ఉగ్రఘటనపై దేశం మొత్తం ఆగ్రహంగా ఉంది. ఈ క్రమంలో ఆయన భార్య హిమాన్ని నర్వాల్ వ్యక్తంచేసిన అభిప్రాయంపై సోషల్ మీడియాలో వస్తోన్న విమర్శలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, జాతీయ కమిషన్ ప్రతి మహిళ గౌరవాన్ని కాపాడే దిశగా చర్యలు తీసుకునేందుకు కట్టుబడి ఉందని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. హరియాణాకు చెందిన వినయ్- హిమాన్ని వివాహం ఏప్రిల్ 16న జరిగింది. 19న విందు నిర్వహించారు. అనంతరం భార్యను తీసుకొని జమ్మూకశ్మీర్‌కు హనీమూన్‌కు వెళ్లారు. వారం కూడా గడవక ముందే.. తన కళ్ల ముందే జీవచ్ఛవంలా మారిన భర్తను చూసి హతాశురాలైంది. అంత్యక్రియల సమయంలో భర్తకు సెల్యూట్ చేస్తూ ఆమె రోదించిన తీరు ప్రతిఒక్కరిని బాధించింది.

# అంబర్‌పేట, బీహెచ్‌ఈఎల్ ఫ్లైఓవర్లకు మోక్షం

## ప్రారంభించిన కేంద్రమంత్రి నితిని గడ్కరీ



**ప్రజానావ, హైదరాబాద్:** హైదరాబాద్‌లో అంబర్‌పేట ఫ్లై ఓవరు అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్ నగరంలోని అంబర్‌పేట, బీహెచ్‌ఈఎల్ కూడలిలో నిర్మించిన పైవంతెనలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించారు. రోడ్ల నిర్మాణం కోసం పెండింగ్‌లో ఉన్న భూసేకరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ దీనిని లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా అంబర్‌పేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అందరికీ నమస్కారం, బాగున్నారా? అంటూ తెలుగులో మాట్లాడడం మొదలు పెట్టిన ఆయన అనేక అభివృద్ధి అంశాలపై స్పందించారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు సరిగా సాగడంలేదని గడ్కరీ పేర్కొన్నారు. ఈ పనుల్లో తలెత్తిన సమస్యకు పరిష్కారం కనుగొన్నామని, వేగంగా పూర్తి చేయడంకోసం కొత్త కాంట్రాక్టర్‌ను నియమించామని తెలిపారు. వచ్చే పది నెలల్లో ఫ్లై ఓవర్‌ను పూర్తి చేస్తామన్నారు. రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ భూసేకరణ వేగంగా పూర్తి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. హైదరాబాద్ - విజయవాడ 4 లైన్ల రోడ్డును 6 లైన్లుగా మారుస్తాం. అంబర్‌పేట పైవంతెనను రూ.145 కోట్లతో, నాలుగు వరుసల్లో సుమారు 1.5 కి.మీ మేర నిర్మించగా.. చందానగర్ నుంచి బీహెచ్‌ఈఎల్ మీదుగా రామచంద్రాపురం వరకు రూ.176 కోట్లతో 1.6కి.మీ మేర బీహెచ్‌ఈఎల్ వంతెనను నిర్మించారు. నితిన్ గడ్కరీ కృషి వల్ల ఏ గ్రామానికి వెళ్లినా జాతీయ రహదారులు కనిపిస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు, మరణాలు తగ్గాయన్నారు. అమెరికాను తలదన్నేలా భారత్‌లో జాతీయ రహదారులు ఉన్నాయి. నితిన్ గడ్కరీ దగ్గరకు ఏ పార్టీ ఎంపీ వెళ్లి అడిగినా కాదనకుండా ఇస్తారు. ఆయన్ను ఫ్లై ఓవర్ల మంత్రి అని కూడా పిలుస్తుంటారు. అంబర్‌పేట ఫ్లై ఓవర్ ప్రారంభించుకున్నప్పటికీ సర్వీస్ రోడ్డు అసంపూర్తిగానే ఉంది. ఆరు ప్రాంతాల్లో భూసేకరణ పూర్తి కాకపోవడంతో సర్వీస్ రోడ్డు పూర్తి కాలేదు. రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఆయా ప్రాంతాల్లో భూసేకరణ పూర్తి చేయాలి' అని అన్నారు. నో అనే మాట గడ్కరీ నోటి నుంచి రాదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఉప్పల్, కొంపల్లి కారిడార్‌లు వేగవంతం చేయాలని కేంద్రమంత్రిని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్, కరీంనగర్ హైవేను జాతీయ రహదారిగా ప్రకటించాలని కోరారు. ఇదిలావుంటే అంబర్‌పేట పైవంతెన ప్రారంభోత్సవ సమయంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాంగ్రెస్, భాజపా శ్రేణుల మధ్య తోపులాట చోటు- చేసుకుంది. భాజపా నాయకులు మోదీ..మోదీ అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ నాయకులు పోటీగా నినాదాలు అందుకున్నారు. గడ్కరీ కాన్వాయ్‌ను కాంగ్రెస్ నేతలు అడ్డుకున్నారు. ఆందోళనకు దిగిన కాంగ్రెస్ నేతలను పోలీసులు చెదరగొట్టారు.

# ప్రజావాణిలో 148 దరఖాస్తులు



**ప్రజానావ, ఆదిలాబాద్ :** జిల్లా కేంద్రంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి కలెక్టర్ రాజర్షి షా అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుండి వచ్చిన దరఖాస్తుదారులు తమ సమస్యలను దరఖాస్తు రూపంలో సమర్పించారు. కలెక్టర్ అర్జీదారుల సమస్యలను ఓపికగా విని సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. ప్రజావాణిలో 148 దరఖాస్తులు వచ్చాయని, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్, పంచాయతీ, విద్య, రెవెన్యూ తదితర శాఖలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించారు. ఈ ప్రజావాణిలో జిల్లా అధికారులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ కనెక్షన్ కోసం
# డబ్బులు వసూలు
### సూపర్‌వైజర్‌పై ప్రజావాణిలో ఫిర్యాదు



**ప్రజానావ, తాండూర్:** తాండూర్ మండలం రాజీవ్ నగర్ గ్రామ పంచాయతీ పరిధిలో మిషన్ భగీరథ నల్ల కొత్త కనెక్షన్, షిఫ్టింగ్ కనెక్షన్ల కోసం మిషన్ భగీరథ గ్రిడ్ సూపర్‌వైజర్ డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో తాండూర్ తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ కు మాజీ సర్పంచ్ కాల్వల కిష్టఫర్ ఆధ్వర్యంలో పలువురు యువకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా ఉచితంగా ప్రతి గ్రామంలో ఇంటింటికి ఫ్రీగా కనెక్షన్ ఇచ్చిందననారు. ప్రస్తుతం నల్లా కనెక్షన్ కోసం ప్రజల వద్ద నుండి డబ్బులు డిమాండ్ చేస్తున్న గ్రిడ్ సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నవీన్, తిరుపతి, సాయి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణితో సమస్యలు పరిష్కారం
### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా .. 167 దరఖాస్తుల స్వీకరణ

**ప్రజానావ, సిరిసిల్ల:** ప్రజావాణిలో వచ్చే సమస్యలు పరిష్కరిస్తున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చే అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. పెండింగ్లో పెట్టవద్దని స్పష్టం చేశారు. మొత్తం 167 దరఖాస్తులు వచ్చాయి. సీపీఓకు 1, జిల్లా వ్యవసాయ అధికారి 1, జిల్లా పౌర సరఫరాల అధికారి 5, జిల్లా విద్యాధికారి 3, జిల్లా వైద్యాధికారి 10, మైనార్టీ సంక్షేమ అధికారి 1, డీఆర్డీఓ 3, జిల్లా సంక్షేమ అధికారి 4, ఈ డీ ఎం 1, గృహ నిర్మాణ శాఖకు 6, ఎల్డీఎం 4, సెస్ కార్యాలయం 4, మెడికల్ కాలేజీ 1, ఎంపీడీవో ఇల్లంతకుంట 2, గంభీరావుపేట 5, కోనరావుపేట 2, ముస్తాబాద్ 3, తంగళ్ళపల్లి 12 , వేములవాడ రూరల్ 1 ఎల్లారెడ్డిపేట 4, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల 11, మున్సిపల్ కమిషనర్ వేములవాడ 3, ఆర్డీవో సిరిసిల్ల 6, ఆర్డీవో వేములవాడ 4, ఎస్డీసీ 16, ఎస్పీ కార్యాలయం 3, తహసీల్దార్ బోయిన్పల్లి 5, చందుర్తి 3, ఇల్లంతకుంట 8, గంభీరావుపేట 3, కోనరావుపేట 3, ముస్తాబాద్ 2, సిరిసిల్ల 3, తంగలపల్లి 9, వీర్నపల్లి 1, వేములవాడ 4,వేములవాడ రూరల్ 2, ఎల్లారెడ్డిపేటకు 6, డీసీఎంఎస్‌కు 1 వచ్చాయి. ప్రజావాణిలో కలెక్టర్‌తో పాటు డీఆర్డీఓ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

# సాండ్గాం గ్రామంలో రాళ్ల వాన బీభత్సం

- 2000 ఎకరాల వరి పంట నష్టం
- ఆర్థిక సంక్షోభంలో రైతులు
- మిగిలిన పంట తీసుకొని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల డిమాండ్





**ప్రజానావ, కాగజ్ నగర్:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండల సాండ్గాం గ్రామ పంచాయతీలో ఇటీవల సంభవించిన రాళ్ల వాన కారణంగా సుమారు 2,000 ఎకరాల వరి పంట పూర్తిగా ధ్వంసమైంది. ఈ దుర్ఘటనతో రైతులు తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటూ దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి స్పందన లేకపోవడం, రాజకీయ నాయకుల నిర్లక్ష్యం వల్ల రైతులు ఆవేదనన చెందుతున్నారు.స్థానిక వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించినప్పటికీ, రైతులు తమ నష్టాన్ని అధికారికంగా నమోదు చేయడంలో ఎటువంటి సహకారం అందలేదు. ఈ పరిస్థితుల్లో కనీసం మిగిలి ఉన్న పంటనైనా ప్రభుత్వం కోతలు లేకుండా కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.రైతులు ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వెంటనే నష్టపరిహారం, పంట బీమా సౌకర్యాలు, మరియు మిగిలిన పంట కొనుగోలుకు ప్రభుత్వం ముందుకు రావాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.రైతుల ఈ దీనస్థితిని పరిగణనలోకి తీసుకుని, వారి ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సాండ్గాం గ్రామ రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## చొరబాటుదారులను
# తరిమివేయాలి

**ప్రజానావ, నర్సాపూర్(జీ):** పాకిస్తాన్, బంగ్లాదేశ్, మయన్మార్ దేశాల నుంచి అక్రమంగా చొరబడి దేశంలో నివసిస్తున్న వారిని వెంటనే గుర్తించి, తరిమి వేయాలని బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌సోమ శ్రీనివాస్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బర్కుంట నరేందర్, జిల్లా కార్యదర్శి రాజేందర్, నాయకులు సవీన్, చందు గౌడ్, దత్తురాం, రాజు, రాము, లక్ష్మణ్, గంగారాం, నరేష్, మాజీ ఎంపీటీసీ భూమన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.






# పదో తరగతి టాపర్లకు సన్మానం

**ప్రజానావ, ఆదిలాబాద్ :** ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఎన్నో మార్పులు వచ్చాయని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టర్ సహాయ సహకారాలతో విద్యార్థులపై చూపించిన ప్రత్యేక శ్రద్ధ, ప్రోత్సాహంతో, గూగుల్ మీట్ ద్వారా దిశా నిర్దేశంతోనే జిల్లా టాప్ గా నిలిచింది. అందరి సహకారంతో జిల్లా పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 97. 18 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్ర స్థాయిలో 9 వ స్థానం నిలిచిందని కలెక్టర్ ను అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. పదో తరగతి విద్యార్థులకు కలెక్టర్ అభినందనందనలు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను సన్మానించారు. టాపర్ గా నిలిచిన విద్యార్థులు కలెక్టర్ కు ధన్యవాదాలు తెలుపుతూ వారి వారి గోల్స్ ను వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్, డీఐఈఓ గణేష్, వెల్ఫేర్ హాస్టల్ ప్రిన్సిపల్స్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్ల ఎంపికలో కాంగ్రెస్‌చేతివాటం



**ప్రజానావ, తిర్యాణి:** ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అధికార పార్టీ చేతివాటం ప్రదర్శిస్తున్న దని బీజేపీ తిర్యాణి మండల మాజీ అధ్యక్షుడుపులి వెంకటేష్ ఆరోపించారు. అర్హులకు కాకుండా పార్టీకి సంబంధించిన కార్యకర్తలను ఎంపిక చేస్తున్నారని మండిపడ్డారు. నిజమైన అర్హులకు ఇండ్లు ఇవ్వకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఒక్కొక్క గ్రామపంచాయతీ లిస్టు చూస్తుంటే అర్హులు కాకుండా అనర్హుల పేర్లే ఎక్కువ దర్శనమిస్తున్నాయని మండిపడ్డారు. ఎకరాలకు ఎకరాలు భూమి ఉండి, రైతు బంధు, ప్రభుత్వ పథకాలు తీసుకుంటున్న వారిని కూడా ఎంపిక చేసి అర్హులకు అన్యాయం చేశారని తెలిపారు. ఎప్పుడు గ్రామ సభలు నిర్వహించి, లబ్ధిదారులను ఎంపిక చేశారో అధికారులు చెప్పాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. గ్రామసభలు నిర్వహించకుండానే ప్రత్యేక అధికారి, తహసీల్దార్, డిప్యూటీ తాసిల్దార్, పర్యవేక్షణ లేకుండానే ఇండ్ల ఎంపిక జరిగిందని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

# గీత కార్మిక సహకార సంఘం పేరిట భూమి పట్టా ఇవ్వాలి




**ప్రజానావ, నర్సాపూర్(జీ):** నర్సాపూర్ మండలం రెవెన్యూ శివారంలో 667/ఈ సర్వే నంబర్లలో 5 ఎకరాల భూమి గీత కార్మిక సహకార సంఘం పేరిట కేటాయించారని, ఇది కేటాయించి 23 ఏండ్లు గడుస్తున్నా పట్టా ఇవ్వలేదని, ఇదే విషయం గతంలో పలుమార్లు నిర్మల్ కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించానని ప్రముఖ సామాజిక కార్యకర్త డాక్టర్ ముష్కం సుదర్శన్ గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టంలో గీత కార్మిక సహకార సంఘం పేరిట కేటాయించిన భూమి పట్టా జారీ చేయాలని తహసిల్దార్ సోమ శ్రీనివాస్ కు ప్రజావాణిలో విన్నవించారు.

# శతజయంతి పోస్టర్ల విడుదల




**ప్రజానావ, బెల్లంపల్లి :** వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు ఏంసీపీఐయూ వ్యవస్థాపక నేత కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ వాల్ పోస్టర్ సోమవారం విడుదల చేశారు. అనంతరం ఏంసీపీఐయూ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ ప్రజల మన్ననలు పొంది గెలిచారని ప్రజా సేవకే తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. దేశవ్యాప్తంగా పార్టీని వ్యాప్తింపచేసి 2006లో ఏంసీపీఐయూగా ఏర్పరిచారని అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో బూటకపు ఎన్‌కౌంటర్లను వ్యతిరేకిస్తూ నక్సలిజం ప్రభుత్వ వైఖరి అనే అంశంపై శాసనసభలో రెండున్నర గంటలు ఏకధాటిగా ప్రసంగించి, తనదైన శైలిలో ఒక ప్రత్యేకతను సంపాదించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీడబ్ల్యూ ప్రజాతంత్ర మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దుర్గం లక్ష్మి, కామెర పద్మ, దుర్గం రాజేశ్వరి, గొల్లపల్లి లింగన్న, రామ్ టెంకి దేవాజి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీలో అవకతవతలు
### ఆధారాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు



Prajavani Acknowledgement Receipt

Name :MD ZABIR
Mobile No. : 9493887000
Address :Narspur G,Narspur G,Narspur G
Village :NARSAPUR
Mandal :NARSAPUR G
Grievance Subject :Requests

Your Grievance is Registered vide Registration no.RDNML/E/2025/00053 On 05/05/2025
Please keep the registration number for all future correspondence. Your Grievance is sent to
DISTRICT RURAL DEVELOPMENT AGENCY NIRMAL

**ప్రజానావ, నర్సాపూర్(జీ):** ఉపాధి హామీ పథకాన్ని నర్సాపూర్ (జీ) మం డలంలో నీరుగారుస్తున్నారా? అంటే.. అవుననే సమాధానం వస్తుంది. నర్సా పూర్(జీ) మండలం లో గతంలో పలుమార్లు ఉపాధి హామీ అవకతవకలపై ఎంపీడీవో పుష్పలతకు పలు గ్రామాల నుంచి ఫిర్యాదులు అందినా.. ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆధారాలతో సహా నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్.. విచారణ జరిపి నివేదిక సమర్పించాలని డీఆర్డీవో పీడీ విజయలక్ష్మిని ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లో కూలీల సంఖ్య కంటే ఎక్కువ నమోదు చేసి రూ.100 వసూలు చేస్తున్నారని, అదేవిధంగా ఒకచోట పని చేసి అదే ఫొటోను మూడు చోట్ల అప్‌లోడ్ చేస్తున్నారని బలమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయం ఎంపీడీవో ఇన్‌చార్జి ఏపీవో జగన్నాథ్, టెక్నికల్ అసిస్టెంట్ రవీందర్, సతీష్, కంప్యూటర్ ఆపరేటర్లకు తెలిసినా చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. జిల్లా అధికార యంత్రాంగం ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించినట్లయితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయని మండలవాసులు చర్చించుకుంటున్నారు.

# సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

- సిరిసిల్ల ఎస్పీ మహేశ్ బీ గితే



**ప్రజానావ, సిరిసిల్ల:** ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం అందించేందుకే జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ మహేశ్ బీ గితే తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుండి 32 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని చెప్పారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని సూచించారు. దీంతో ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారమయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని వివరించారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# రాజన్న సేవలో సింగర్ మానుకోట ప్రసాద్




**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని సోమవారం సింగర్ మానుకోట ప్రసాద్ దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనం తర్వాత నాగిరెడ్డి మండపంలో అర్చకులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణలో ఏ ప్రాంతంలో ఏ ఇంట్లో పనులు మొదలుపెట్టాలంటే వేములవాడ రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుందని చెప్పారు. చాలాసార్లు స్వామివారిని దర్శించుకోవడం జరిగిందని పేర్కొన్నారు. త్వరలోనే వేములవాడ రాజన్న గుడిపై, రాజన్నపై కొత్త సాంగ్‌తో మీ ముందుకు వస్తున్నానన్నారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ టెంపుల్ చానెల్ ఎస్ఆర్ఆర్ఎస్‌డీ యూట్యూబ్ చానెల్‌ను లైక్, షేర్, సబ్స్క్రైబ్ చేయడం ద్వారా ఆలయంలో జరిగే పూజలు, వార్తల వివరాలను, సమాచారం త్వరగా చూడవచ్చని అన్నారు.

అంబర్‌పేట ఫ్లైఓవర్ ప్రారంభోత్సవానికి బయల్దేరిన జూబ్లీహిల్స్ డివిజన్ బీజేపీ నాయకులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గడ్డం వెంకటస్వామి, డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ కౌన్సిల్ మెంబర్ సీతల అనిల్ కుమార్, కార్యవర్గ సభ్యులు దండగుల శ్రీనివాస్, ఖైరతాబాద్ అసెంబ్లీ బీజేవైఎం కో- కన్వీనర్ దండగుల శేఖర్, బీజేపీ సీనియర్ నాయకులు శశి శేఖర్, దొంగరి రాజకళ, మంజలి నరసింహా, వలిశెట్టి రాంబాబు, పీహెచ్ గిరి, మల్లేశ్ యాదవ్, బాలరాజు, పద్మ, పారిజాతమ్మ, లక్ష్మక్క, నాగలక్ష్మి, తదితర నాయకులు పాల్గొన్నారు.

- ప్రజానావ, ఖైరతాబాద్



# భూ సేకరణ పనులు వేగంగా పూర్తిచేయాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- వేములవాడ ఆలయ రోడ్డు విస్తరణ, భూ సేకరణ పనులపై సమీక్ష



**ప్రజానావ, సిరిసిల్ల:** ఆలయ రోడ్డు విస్తరణ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో వేములవాడ ఆలయ రోడ్డు విస్తరణ, భూ సేకరణ పనులపై కలెక్టర్ సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేములవాడ ఆలయం వద్ద రోడ్డు విస్తరణ పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, వీటికి అవసరమైన భూ సేకరణ చేసేందుకు తొలగించాల్సిన సర్వే చేసి త్వరగా అందించాలని, విధుల్లో అలసత్వం వహించిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. 315 ఇండ్ల నిర్మాణాల ప్రతిపాదనలను నాలుగు ఇంజినీరింగ్ బృందాల అధికారుల ద్వారా ఇప్పటివరకు 257 ఇండ్లకు సంబంధించిన సర్వే పూర్తి చేసినట్లు, మిగిలినవి వీలైనంత త్వరగా అందిస్తామని అధికారులు తెలిపారు. భూ సేకరణ చట్టం 2013 సెక్షన్ 12 ప్రకారం భూసేకరణ నిమిత్తం సర్వే చేసే పూర్తి అధికారాలు మనకు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. చట్టంపై అధికారులు అవగాహన పెంచుకొని వారంలో మొత్తం భూ సేకరణ సర్వే పొరపాట్లు జరగకుండా పూర్తిచేసి ప్రతిపాదనలు అందిస్తే వెంటనే అవార్డులు అందజేస్తామని అన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాధ భాయి, ఈ ఈ ఆర్%ఢ%బి రమణయ్య, వేములవాడ మున్సిపల్, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్



**ప్రజానావ, ఆదిలాబాద్ :** ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్టు ఆదిలాబాద్ రెండో పట్టణ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. లారీ అసోసియేషన్ ఏరియా వద్ద పేక ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేయగా, సిరాజ్ ఖాన్, షేక్ హసేన్, సందీప్, షబ్బీర్ ఖాన్, షేక్ మునీర్ పట్టుబడ్డారన్నారు. వీరందరూ లారీ ఓనర్లు, డ్రైవర్లుగా ఉన్నారని తెలిపారు. వారి వద్ద నుండి రూ. 8,800 నగదు, 4 మొబైల్ ఫోన్లు, 4 బైకులు స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించినా ఉపేక్షించేది లేదని, వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

## గంజాయి వ్యాపారికి జైలు, జరిమానా

**ప్రజానావ, జైనూర్ :** గంజాయి సేకరించి, వ్యాపారం చేస్తున్న కేసులో జైనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తికి మూడు నెలల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్‌డిస్ట్రిక్ట్‌సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్ తీర్పు ఇచ్చారు. జైనూర్ ఎస్సై రవికుమార్ వివరాల ప్రకారం.. గతంలో జైనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న తిరుపతి పోలీస్ సిబ్బందితో తేదీ 26.07.2020 న జైనూర్ పరిసర ప్రాంతాల్లో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, ద్విచక్ర వాహనంపై వెళ్తున్న షైక్ అమరుద్దీన్ వద్ద గల బ్యాగులో గంజాయి లభ్యమైంది. అతనిని విచారించగా పరిసర ప్రాంత గ్రామాల నుండి గంజాయి సేకరించి, మహారాష్ట్రకు తరలిస్తున్నామని తెలిపాడు. అప్పటి జైనూర్ ఎస్సై తిరుపతి వారిపై కేసు బుక్ చేసి మొదటి ఐఓ సురేష్, సీఐ జైనూర్ రెండవ ఐఓ ఆ తదుపరి జైనూర్ సీఐ హానూక్ విచారణ జరుపగా, ప్రస్తుత జైనూర్ సీఐ, జైనూర్ ఎస్ఐ సాక్షులను కోర్టులో హాజరుపరచగా , పీపీ జగన్ మోహన్ రావు, ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్ విచారణ జరుపగా, నేరం చేసినట్లు రుజువు కావడంతో నిందితుడు షైక్ అమరద్దీన్ కు పై శిక్షను విధించారు.

## టీబీ రహిత సమాజాన్ని నెలకొల్పాలి



**ప్రజానావ, నేరడిగొండ :** టీబీ రహిత సమాజంగా నెలకొల్పాలని డీటీసీఓ డాక్టర్ సుమలత, డాక్టర్ సద్దాం అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సదర్శించి టీబీ వ్యాధి గ్రహస్తులకు నిక్షయ్ కిట్స్ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం టీబీ గ్రహస్తులకు అందిస్తున్న నిక్షయ్ కిట్లను దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టీబీ వ్యాధి లక్షణాలు కనబడితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య చికిత్స జరుపుకోవాలని అన్నారు. వైద్యులు సూచించిన విధంగా క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధిని నయం చేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఇఓ పవర్ రవీందర్, హెల్త్ అసిస్టెంట్ సంతోష్ హెల్త్ సూపర్ వైజర్‌స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి.. 8మంది అరెస్టు

**ప్రజానావ, వాంకిడి:** మండలం బోర్ద గ్రామ శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి, 8మందిని అరెటు చేసినట్టు వాంకిడి ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పక్కా సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో కలిసి సోమవారం సాయంత్రం బోర్ద గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడులు చేశారన్నారు. ఈ దాడుల్లో 8 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.17,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదే విధంగా వాంకిడి మండలంలో పేకాట ఆడినట్లు తెలిస్తే 100కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## డ్రైనేజీలను పూర్తిచేయాలి

**ప్రజానావ, వాంకిడి:** మండల కేంద్రంలోని 363 జాతీయ రహదారిపై అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ పనులను పూర్తిచేయాలని అంబేద్కర్ కాలనీవాసులు రోడ్డుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 363 జాతీయ రహదారిపై , అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ పనులను పూర్తిచేయాలని, డీబీఎల్‌కంపెనీ నిర్లక్ష్యం వల్ల డ్రైనేజీ పనులు పూర్తి చేయకపోవడం సిగ్గుచేటన్నారు. సోమవారం 363 జాతీయ రహదారిని జాతికి అంకితం చేస్తున్న నితిన్ గడ్కరీ, జాతీయ రహదారిపై డ్రైనేజీలలో నిర్మించి, ప్రజల సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ప్రతిభ చూపిన విద్యార్థులకు కలెక్టర్ అభినందన

**ప్రజానావ, సిరిసిల్ల:** పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అభినందించారు. పదో తరగతి పరీక్షల ఫలితాలు ఇటీవల విడుదల కాగా, ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పీ. ప్రణవి 564, స్వేచ్ఛ 538, పీ.కిరణ్ తేజ 537, పీ.మధుశాలిని 533, సంపత్ కుమార్ 533, శ్రీవాణి 525, జీ.రుచిత 524 మార్కులు సాధించగా, వారిని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాగే మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీ. మురళీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.







# వన్డేల్లో 124 రేటింగ్ పాయింట్లతో భారత్ అగ్రస్థానం

### టెస్టుల్లో ఆసీస్ దే పై చేయి!.. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత్ జోరు

**దుబాయి:** అంతర్జాతీయ క్రికెట్ మండలి తాజా వార్షిక ర్యాంకింగ్స్ ప్రకారం భారతదేశం, ఆస్ట్రేలియా క్రికెట్ జట్లు అన్ని ఫార్మాట్లలో తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాయి. మే 2024 నుండి ఇప్పటి వరకు జరిగిన అన్ని అంతర్జాతీయ మ్యాచ్‌లను 100 శాతం బేస్‌గా తీసుకుని, గత రెండు సంవత్సరాల మ్యాచ్‌లను 50 శాతం విలువతో లెక్కించి విడుదల చేసిన ఈ ర్యాంకింగ్స్‌లో భారత్ టీ20, వన్డే ఫార్మాట్లలో అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగా, టెస్ట్ క్రికెట్‌లో మాత్రం ఆస్ట్రేలియా తన సింహాసనాన్ని మళ్లీ కైవసం చేసుకుంది. ప్రస్తుతం వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ విజేత అయిన ఆస్ట్రేలియా 126 రేటింగ్ పాయింట్లతో టెస్ట్ ఫార్మాట్‌లో నంబర్ వన్ జట్టుగా ఉంది. ఇది రెండవ స్థానంలో ఉన్న ఇంగ్లాండ్‌పై 13 పాయింట్ల ఆధిక్యం. ఇక ఈ ఏడాది ఆస్ట్రేలియాతో ఫైనల్‌లో తలపడనున్న దక్షిణాఫ్రికా 111 పాయింట్లతో మూడవ స్థానంలో ఉండగా, భారత్ నాల్గవ స్థానానికి పడిపోయింది. న్యూజిలాండ్, శ్రీలంక, పాకిస్తాన్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, ఐర్లాండ్ జట్లు వరుసగా టాప్ 10లో స్థానం పొందాయి. ఇక వన్డేల్లో భారత్ 124 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా (రెండు జట్లు 109 పాయింట్లు) భారత్‌కు వెనుకంజలో ఉన్నా, శ్రీలంక, పాకిస్తాన్ (104 పాయింట్లు) కూడా పోటీగా నిలుస్తున్నాయి. ఈ జాబితాలో దక్షిణాఫ్రికా, ఆఫ్ఘనిస్తాన్, ఇంగ్లాండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్ వంటి జట్లు దిగువ స్థానాల్లో ఉన్నాయి. అదే విధంగా టీ20 ఫార్మాట్‌లోనూ భారత్ తన ఆధిపత్యాన్ని మరింత బలంగా చూపించింది. ఇటీవలే టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు 271 రేటింగ్ పాయింట్లతో టాప్‌లో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, వెస్టిండీస్ ఉన్నారు. దక్షిణాఫ్రికా, శ్రీలంక, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ వరుసగా ఆరెవ నుండి పదవ స్థానాల్లో ఉన్నాయి. ఈ ర్యాంకింగ్స్ చూస్తే, భారత్ తన పరాక్రమాన్ని పరిపూర్ణంగా ప్రదర్శించడమే కాక, భవిష్యత్తులో కూడా అన్ని ఫార్మాట్లలో ప్రభావాన్ని కొనసాగించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టంగా తెలుస్తోంది. ఈ ర్యాంకింగ్స్ భారత్‌కు విశ్వాసాన్ని అందించడమే కాక, రాబోయే టోర్నమెంట్లకు సన్నద్ధమవ్వడానికి మోటివేషన్‌ను కూడా ఇస్తున్నాయి. టీ20 వరల్డ్ కప్ వంటి మెగా టోర్నీలకు ముందు, భారత్ అన్ని ఫార్మాట్లలో టాప్ ర్యాంక్‌ను కొనసాగించడమే కాక, యువతరం ఆటగాళ్లను బలోపేతం చేయడంపై కూడా దృష్టి పెట్టనుంది. బీసీసీఐ వ్యూహాత్మకంగా స్క్వాడ్‌ను రొటేట్ చేస్తూ, అనుభవం, యువ శక్తికి సమతౌల్యాన్ని తీసుకువచ్చే దిశగా ముందుకు సాగుతోంది. ఇదే ధోరణిలో కొనసాగితే, భారత్ అంతర్జాతీయ క్రికెట్‌లో గల గ్లోబల్ డామినెన్స్‌ను మరింత పటిష్టం చేసే అవకాశముంది.

# కొనసాగుతున్న పంత్ వైఫల్యాల బాట



**జైపూర్:** లక్నో సూపర్ జెయింట్స్ పరాజయాల పరంపరం కొనసాగుతోంది. వరుసగా మూడు మ్యాచ్ ల్లో ఓడిపోయి, పరాజయాల హ్యాట్రిక్ నమోదు చేసింది. ఆదివారం డబుల్ హెడర్ లో భాగంగా పంజాబ్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ లో 37 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. అయితే ఈ మ్యాచ్ లో జట్టు కెప్టెన్ రిషభ్ పంత్ అంచనాలకు తగినట్లుగా రాణించలేకపోయాడు. 237 పరుగుల టార్గెట్ ఛేదించేందుకు బరిలోకి దిగిన లక్నోకు శుభారంభం దక్కలేదు. 71 పరుగులకే సగం వికెట్లు కోల్పోయింది. ముఖ్యంగా భారీ ఛేదనలో లక్నోను ఆదుకోవడంలో పంత్ విఫలమయ్యాడు. కేవలం 17 పరుగులు మాత్రమే చేసి విఫలమయ్యాడు. అతను ఔటైన విధానంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాధ్యతారాహిత్యంగా ఆడి, వికెట్ పారేసుకున్నాడు. ఈ సందర్భంగా జట్టు ఓనర్ సంజీవ్ గోయెంకా హావభావాలపై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. దీనిపై తమకు తోచిన కామెంట్లు చేస్తూ, లైకులు, షేర్లతో హోరెత్తిస్తున్నారు. గతేడాది ఢిల్లీ క్యాపిటల్స్ కు నాయకత్వం వహించిన పంత్.. ఈ ఏడాది నుంచి లక్నోకు సారథ్యం వహిస్తున్నాడు. రూ.27 కోట్ల భారీ ధరకు అతడిని కొనుగోలు చేసిన లక్నో యాజమాన్యం.. పంత్ ఆటతీరుపై నిరాశ జనకంగా ఉంది. ఈ సీజన్ లో 11 మ్యాచ్ లాడిన పంత్.. 10 ఇన్నింగ్స్ ల్లో బరిలోకి దిగాడు. ఇందులో కేవలం 128 పరుగులు చేసి నిరాశ పర్చాడు. చెన్నై సూపర్ కింగ్స్ పై మాత్రం 63 పరుగులతో రాణించాడు. ఈ సీజన్ లో కేవలం 12 సగటు, వందలోపు స్ట్రైక్ రేట్ తో నిరాశపర్చాడు. కీలకమైన పంజాబ్ తో మ్యాచ్ లోనూ విఫలమయ్యాడు. ధర్మశాలలో పంజాబ్ తో జరిగిన మ్యాచ్ లో లక్నో అన్ని రంగాల్లో విఫలమైంది. ఫస్ట్ బౌలర్లు తేలిపోవడంతో 236 పరుగులను లక్నో సమర్పించుకుంది. సరైన లైన్ అండ్ లెంగ్త్ లేకపోవడంతోపాటు గాడి తప్పిన బౌలింగ్ ను పంజాబ్ బ్యాటర్లు పండుగ చేసుకున్నారు. ఇక బ్యాటింగ్ లో టాపార్డర్ ఘోరంగా విఫలమవడం జట్టు అవకాశాలను దెబ్బ తీసింది. పంత్ కూడా నిర్లక్ష్యంగా ఆడటంతో జట్టుకు ఓటమి తప్పలేదు. ఇక పేలవమైన ఫీల్డింగ్ తో పలు క్యాచ్ లను జారవిడవడం కూడా లక్నోకు శాపంగా మారింది. ఇక ఈ సీజన్ లో మిగిలిన మూడు మ్యాచ్ ల్లోనూ గెలిస్తే తప్ప, లక్నో ప్లే ఆఫ్స్ కు చేరుకునే అవకాశం లేదు. తన చివరి మూడు మ్యాచ్ లను ఆర్సీబీ, జీటీ, సన్ రైజర్స్ హైదరాబాద్ లతో లక్నో ఆడనుంది. ప్రస్తుతం 10 పాయింట్లతో లక్నో సూపర్ జెయింట్స్ ఏడో స్థానంలో ఉంది.

# హైదరాబాద్ ఆశలపై నీళ్లు

**సన్‌రైజర్స్ ప్లే ఆఫ్స్ అవకాశాలు ఆవిరి**
**వర్షం కారణంగా ఢిల్లీతో మ్యాచ్ రద్దు**
**ఇరుజట్లకు చెరో పాయింట్ కేటాయింపు**



**హైదరాబాద్:** ఐపీఎల్ 2025 సీజన్‌లో డిఫెండింగ్ రన్నరప్ సన్‌రైజర్స్ హైదరాబాద్ పోరాటం ముగిసింది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో ఉప్పల్ వేదికగా సోమవారం జరిగిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. సరిగ్గా సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటింగ్ సమయానికి భారీ వర్షం రావడంతో మ్యాచ్‌కు అంతరాయం కలిగింది. వర్షం ఆగిపోయినా.. మైదానం మొత్తం చిత్తడిగా మారిపోయింది. దాంతో కాసేపు వేచి చూసిన అంపైర్లు మ్యాచ్‌ను కొనసాగించే పరిస్థితి లేకపోవడంతో రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. ఈ నిర్ణయంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లే ఆఫ్స్ అవకాశాలు ఆవిరయ్యాయి. ఈ మ్యాచ్ గెలిచి ఉంటే సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు కాస్తో కూస్తో ప్లే ఆఫ్స్ అవకాశాలు ఉండేవి. వర్షం కారణంగా రద్దవ్వడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఖాతాలో ఓ పాయింట్ చేరింది. దాంతో 11 మ్యాచ్‌ల్లో ఆరెంజ్ ఆర్మీ మూడు విజయాలతో 7 పాయింట్స్‌తో 8వ స్థానంలో నిలిచింది. చివరి మూడు మ్యాచ్‌లు గెలిచిన ఆరెంజ్ ఆర్మీ ఖాతాలో 13 పాయింట్స్ చేరుతాయి. సన్‌రైజర్స్ పేలవ ప్రదర్శనతో అభిమానులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. నెక్స్ట్ సీజన్‌కు బెటర్ లక్ చెబుతున్నారు.

**కమిన్స్ మెరుపులు..**

అంతకుముందు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్(3/19) నిప్పులు చెరిగాడు. దీంతో ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 133 పరుగులు మాత్రమే చేసింది. ట్రిస్టన్ స్టబ్స్(36 బంతుల్లో 4 ఫోర్లతో 41 నాటౌట్), అషుతోష్ శర్మ(26 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 41) టాప్ స్కోరర్లుగా నిలవగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. కమిన్స్‌కు తోడుగా.. జయదేవ్ ఉనాద్కత్, హర్షల్ పటేల్ చెరో వికెట్ తీసారు. ప్యాట్ కమిన్స్ సంచలన ప్రదర్శనతో సన్‌రైజర్స్ టీమ్ ఓనర్ కావ్య మారన్ సంతోషంతో ఎగిరి గంతేసింది. ఆరెంజ్ ఆర్మీ బౌలింగ్ ప్రదర్శనను తెగ ఆస్వాదించింది.

**ఢిల్లీ చెత్త రికార్డు..**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆరంభంలోనే బిగ్ షాక్ తగిలింది. ఇన్నింగ్స్ తొలి బంతికే కరుణ్ నాయర్(0) గోల్డెన్ డక్‌గా పెవిలియన్ చేర్చిన ప్యాట్ కమిన్స్.. తన మరుసటి ఓవర్ ఫస్ట్ బాల్‌కు ఫాఫ్ డుప్లెసిస్(3)ను ఔట్ చేశాడు. మూడో ఓవర్ తొలి బంతికి అభిషేక్ పోరెల్(8)ను పెవిలియన్ చేర్చాడు. ఈ ముగ్గుర్ని కమిన్స్.. కీపర్ క్యాచ్‌గానే పెవిలియన్ చేర్చడం గమనార్హం. పిచ్ నుంచి లభించిన సహకారాన్ని అందిపుచ్చుకున్న కమిన్స్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేశాడు. అక్షర్ పటేల్(6)ను హర్షల్ పటేల్ ఔట్ చేయడంతో పవర్ ప్లేలో ఢిల్లీ క్యాపిటల్స్ 4 వికెట్లు కోల్పోయి 26 పరుగులే చేసింది. ఈ సీజన్‌లో ఢిల్లీకి ఇదే అత్యల్ప పవర్ ప్లే స్కోర్ కావడం విశేషం.



**అనవసర రనౌట్..**

పవర్ ప్లే అనంతరం కేఎల్ రాహుల్(10)ను జయదేవ్ ఉనాద్కత్ ఔట్ చేయడంతో ఢిల్లీ 29 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో ట్రిస్టన్ స్టబ్స్, విప్రజ్ నిగమ్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. ఆచితూచి ఆడిన ఈ ఇద్దరూ వీలుచిక్కిన బంతిని బౌండరీకి తరలించారు. 33 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో సెట్ అయిన ఈ జోడీ.. అనవసర తప్పిదంతో మూల్యం చెల్లించుకుంది. సమన్వయ లోపంతో విప్రజ్ నిగమ్(18) రనౌట్‌గా వెనుదిరిగాడు. విప్రజ్ చెప్పిన వినకుండా రెండో పరుగుకు పరుగెత్తిన ట్రిస్టన్ స్టబ్స్ అతని ఔట్‌కు కారణమయ్యాడు. అంతకుముందు ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగిన అషుతోష్ శర్మ, ట్రిస్టన్ స్టబ్స్‌తో కలిసి జట్టును ఆదుకున్నాడు. కమిన్స్, జయదేవ్ ఉనాద్కత్ ఓవర్లు అయిపోవడంతో.. ఈ ఇద్దరూ బ్యాటర్లు స్వేచ్ఛగా ఆడారు. జీషన్ అన్సారీ, హర్షల్ పటేల్‌లను టార్గెట్ చేసి పరుగులు రాబట్టారు. దాంతో 100 పరుగులైనా చేస్తుందా అనిపించిన ఢిల్లీ 133 పరుగుల పోరాడే లక్ష్యాన్ని నమోదు చేసింది.

# 'పెద్ది' షాట్ ఆడిన ఢిల్లీ ప్లేయర్..



**హైదరాబాద్:** ఢిల్లీ క్యాపిటల్స్ యువ ప్లేయర్ సమీర్ రిజ్వీ .. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' మూవీ గ్లింప్స్‌లోని క్రికెట్ షాట్‌ను రీక్రియేట్ చేశాడు. స్టెప్ ఔటై.. పిచ్‌ను బ్యాట్‌తో గుద్ది ఆడే ఈ షాట్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్న విషయం తెలిసిందే. ఈ షాట్‌ను సమీర్ రిజ్వీ ఆడాడు. ఇందుకు సంబంధించిన వీడియోను ఢిల్లీ క్యాపిటల్స్ సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. పెద్ది సినిమా గ్లింప్స్‌లోని హిందీ డైలాగ్స్‌ను ఈ వీడియోకు ఉపయోగించింది. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో కీలక పోరుకు ముందు ఢిల్లీ క్యాపిటల్స్ ఈ షాట్‌ను రీక్రియేట్ చేసింది. ఉప్పల్ వేదికగా జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో ఈ వీడియోను షూట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ వీడియోకు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ఫిదా అయ్యాడు. థ్యాంకూ అంటూ ట్వీట్ చేశాడు. సన్‌రైజర్స్‌తో మ్యాచ్ నేపథ్యంలో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆల్‌ది బెస్ట్ చెప్పాడు. అంతేకాకుండా ఆరెంజ్ ఆర్మీతో జాగ్రత్త అంటూ హెచ్చరించాడు. 'పెద్ది ఫస్ట్ షాట్‌ను రీక్రియేట్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ధన్యవాదాలు. నేటి మ్యాచ్‌కు ఆల్‌ది బెస్ట్. సన్‌రైజర్స్ బలంగా పుంజుకునే ప్రయత్నం చేస్తుంది. జాగ్రత్తగా ప్రిపేర్ అవ్వండి.'అని ఎక్స్‌వేదికగా రాసుకొచ్చాడు. ఈ పోస్ట్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ పెద్ది షాట్ రీక్రియేట్ వీడియోను కూడా జత చేశాడు. ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు డైరెక్షన్‌లో చెర్రీ 16వ సినిమాగా 'పెద్ది' చిత్రం తెరకెక్కుతుంది. ఈ చిత్రాన్ని వ్రిద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్లు సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇందులో కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా వచ్చే ఏడాది మార్చి 27న ఈ సినిమాను రిలీజ్ చేసే అవకాశం ఉంది. పెద్ది ఐకానిక్ క్రికెట్ షాట్‌ను మ్యాచ్‌లో ఆడొచ్చా? అనే సందేహం క్రికెట్ అభిమానులకు నెలకొంది. అయితే ఈ షాట్‌ను ఆడటం చాలా కష్టం. ఆడే ప్రయత్నం చేసినా బ్యాటర్లకు గాయమయ్యే అవకాశాలు ఉన్నాయి. బ్యాటర్‌కు అంత సమయం దొరకడం కష్టం. స్టెప్ ఔటై.. బ్యాట్‌ను క్రీజుతో గుద్దితే అంపైర్ ఊరుకోడు. రూల్స్ ప్రకారం చర్యలు తీసుకుంటాడు. బ్యాట్‌తో బలంగా క్రీజును గుద్దితే .. పిచ్ డ్యామేజ్ అవుతుంది. ఈ సీజన్ ఆరంభంలో వరుస విజయాలతో టాప్ లేపిన ఢిల్లీ.. ఆ తర్వాత వరుస పరాజయాలతో చతికలపడింది. ప్రస్తుతం 10 మ్యాచ్‌ల్లో 6 విజయాలతో పాయింట్స్ టేబుల్‌లో ఐదో స్థానంలో కొనసాగుతోంది. ఢిల్లీ ప్లే ఆఫ్స్ చేరాలంటే తమ చివరి 4 మ్యాచ్‌ల్లో రెండు గెలవాలి. ప్లే ఆఫ్స్ చేరడానికి ప్రతీ జట్టు 16 పాయింట్స్ సాధించాల్సి ఉంటుంది. రన్‌రేట్ కూడా మెరుగ్గా ఉండాలి. టాప్-2లో నిలవాలంటే 18-20 పాయింట్స్ సొంతం చేసుకోవాలి. ఈ క్రమంలోనే సన్‌రైజర్స్‌తో జరిగే నేటి మ్యాచ్‌లో ఢిల్లీ గెలవడం అత్యంత కీలకం.

# ఆర్‌సీబీ మ్యాచ్‌లకు కోట్లలో వ్యూస్!

**బెంగళూరు:** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. గత 17 సీజన్లు ఒక్క టైటిల్ గెలవకున్నా ఆర్‌సీబీ అభిమాన గణం ఇసుమంత కూడా తగ్గలేదు. 'ఈ సాల కప్ నమ్‌దే'అంటూ ప్రతీ సీజన్‌లో ఊరించి ఊసురుమనించినా.. ఆ జట్టుపై ఆదరణ పెరిగిందే తప్పా ఏ మాత్రం తగ్గలేదు. ఒక్క టైటిల్ గెలవలేదని ప్రత్యర్థి జట్ల అభిమానులు గేలి చేసినా.. ఆర్‌సీబీ ఫ్యాన్స్ వెనకడుగు వేయలేదు.. జెర్సీలు మార్చలేదు. ఇంకా జట్టుపై ప్రేమను పెంచుకున్నారు. ఈ విషయం మరోసారి స్పష్టమైంది. ఐపీఎల్ 2025 సీజన్‌లో జియోహాట్ స్టార్ వేదికగా ఆర్‌సీబీ మ్యాచ్‌లకే ఎక్కువ వ్యూస్ వచ్చాయి. ఐదేసి టైటిళ్లు గెలిచామని గొప్పగా చెప్పుకునే ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్‌లను కూడా ప్రేక్షకులు పెద్దగా పట్టించుకోలేదు. కానీ ఆర్‌సీబీ మ్యాచ్‌లను కోట్ల మంది వీక్షించారు. ఐపీఎల్ 2025 సీజన్‌కు సంబంధించి జియో హాట్‌స్టార్ 'క్యూములేటివ్ వ్యూస్' జాబితా ప్రకారం ఆర్‌సీబీ మ్యాచ్‌లకే రికార్డ్ వ్యూస్ వచ్చాయి. ఒక వీడియో లేదా లైవ్ స్ట్రీమ్(ప్రత్యక్ష ప్రసారాన్ని)ను మొత్తం ఎన్నిసార్లు చూశారో తెలిపే సంఖ్య. ఒక వ్యక్తి ఒక వీడియోను చాలాసార్లు చూసినా, ప్రతి వీక్షణను లెక్కిస్తారు. ఉదాహరణకు, ఒక వీడియోకు 100 క్యూములేటివ్ వ్యూస్ ఉంటే..ఆ వీడియోను ప్రజలు మొత్తం 100 సార్లు చూశారని అర్థం. ఎంత మంది యూజర్స్ అనే లెక్కతో సంబంధం లేకుండా మొత్తం వ్యూస్‌ను పరిగణలోకి తీసుకొని లెక్కిస్తారు. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఆర్‌సీబీ, కేకేఆర్ మధ్య జరిగిన ఆరంభ మ్యాచ్‌కు మొత్తం 41.4 కోట్ల క్యూములేటివ్ వ్యూస్ వచ్చాయి. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఇదే రికార్డ్. ఆ తర్వాత బెంగళూరు వేదికగా శనివారం జరిగిన మ్యాచ్‌కు 37.3 క్యూములేటివ్ వ్యూస్ వచ్చాయి. ఆర్‌సీబీ వర్సెస్ ముంబై ఇండియన్స్ మ్యాచ్‌కు 34.1 వ్యూస్, ఆర్‌సీబీ వర్సెస్ సీఎస్‌కే 34 కోట్లు వ్యూస్ రాగా.. సీఎస్‌కే వర్సెస్ ముంబై మ్యాచ్‌కు 30.9 కోట్ల వ్యూస్ మాత్రమే వచ్చాయి. జియోహాట్ స్టార్ విడుదల చేసిన టాప్-8 మ్యాచ్‌ల వ్యూస్ జాబితాలో ఆరు ఆర్‌సీబీ మ్యాచ్‌లే ఉండటం గమనార్హం.

**ఆర్‌సీబీ వర్సెస్ కేకేఆర్ - 41.4 కోట్లు.**
**ఆర్‌సీబీ వర్సెస్ సీఎస్కే - 37.3 కోట్లు.**
**ఆర్‌సీబీ వర్సెస్ ఎంఐ - 34.1 కోట్లు.**
**ఆర్‌సీబీ వర్సెస్ సీఎస్కే - 34 కోట్లు.**
**సీఎస్‌కే వర్సెస్ ఎంఐ - 30.9 కోట్లు.**
**ఆర్‌సీబీ వర్సెస్ పంజాబ్ కింగ్స్ - 28.8 కోట్లు.**
**ఎస్ఆర్‌హెచ్ వర్సెస్ ఆర్ఆర్ - 28.6 కోట్లు.**
**ఆర్‌సీబీ వర్సెస్ ఆర్ఆర్ - 27.9 కోట్లు.**

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..






# శుభం

## ఓ మంచి మూవీ.. ఆదరించండి

### నటి సమంత ప్రేక్షకులకు విజ్ఞప్తి



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టి 'శుభం' చిత్రాన్ని నిర్మించిన సంగతి తెలిసిందే. ఇందులో సామ్ అతిథి పాత్ర కూడా పోషించారు. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించిన ఈ మూవీలో హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పెరి, శ్రియ కొంతం, శ్రావణి లక్ష్మి, షాలిని కొండేపూడి, వంశీధర్ గౌడ్ ప్రధాన పాత్రలు పోషించారు. ఇక మే 9న విడుదల కానున్న ఈ మూవీ ప్రమోషన్స్ కూడా జోరుగా చేస్తున్నారు. తన హోమ్ బ్యానర్ నుంచి రాబోతున్న ఫస్ట్ మూవీ కావడంతో సమంత కూడా చాలా యాక్టివ్‌గా ప్రమోషనల్ కార్యక్రమాలలో పాల్గొంటు-న్నారు. ఇక రీసెంట్ గా ఈ మూవీకి సంబంధించి వైజాగ్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. సమంతతో సహా సినిమాలో నటించిన నటీనటులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామ్ మాట్లాడుతూ.. వైజాగ్ లో ఈవెంట్స్ జరుపుకున్న తన సినిమాలు అన్నీ గుర్తు చేసుకుంది. ఇక్కడ ఈవెంట్ చేసిన ప్రతి సినిమా మంచి విజయం సాధించాయి, 'శుభం' చిత్రాన్ని కూడా ఆదరిస్తారని కోరుకుంటున్నట్లు చెప్పుకొచ్చింది. మూవీ చూశాక అందరు కూడా చిరు నవ్వుతోనే బయటకు వస్తారని పేర్కొన్నారు. అలాగే దాదాపు ఈ మూవీలో చాలా వరకు కొత్త వారినే తీసుకున్నారు. దీంతో ప్రతి ఒక్క ఈ మూవీ గురించి వారి అనుభూతిని పంచుకున్నారు. ఈ సందర్భంగా హీరో హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ.. ' రాజ్ అండ్ డీకే కారణంగానే ఈ సినిమాలో నటించే అవకాశం దక్కింది. స్టోరీ చెప్పినప్పుడే పడి పడి నవ్వుకున్నాను, హారర్ కామెడీని ఇలా కూడా తియ్యొచ్చా అనుకున్నాను. అండ్ సమంత మామ్ ఐ లవ్ యూ.. మీరు బాగా సపోర్ట్ చేశారు' అని చెప్పగా.. సామ్ నవ్వేసింది. ప్రజంట్ ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

# రామయణ మూవీపై సిఎం ఫడ్ణవీస్ ప్రశంసలు




బాలీవుడ్‌లో తెరకెక్కుతున్న క్రేజీ ప్రాజెక్ట్ 'రామాయణ' సినిమాపై మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ ప్రశంసలు కురిపించారు. ఇది ప్రపంచంలోనే అత్యంత గొప్పది గా నిలిచే చిత్రమని కొనియాడారు. నిర్మాత నమిత్ మల్హోత్రాతో కలిసి ఓ చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బాలీవుడ్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి నితేశ్ తివారీ దర్శకుడు. బీటౌన్ అగ్ర నిర్మాతలతో కలిసి అల్లు అరవింద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా గ్లింప్స్‌ను వేవ్స్ సమ్మిట్‌లో ప్రదర్శించారు. ఈ సినిమా గురించి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడనవీస్ మాట్లాడుతూ.. 'భారత్‌లో ఎన్నో గొప్ప కథలు తెరకెక్కాయి. మన కళ, నాటక రంగం, సంగీతం చాలా పురాతనమైనవి. వీటికి తాజాగా కొత్త టెక్నాలజీని జోడించాలని అనుకుంటున్నాం. రామాయణ విషయంలో ఇదే జరుగుతోంది. నేను ప్రధానితో కలిసి ఈ సినిమాకు సంబంధించిన సెట్స్‌ను సందర్శించాను. దాని క్వాలిటీ చూసి ఆశ్చర్యపోయాను. కొత్త తరానికి మనం కథలు చెప్పడానికి ఇదే సరైన మార్గం. మీరు తీస్తోన్న సినిమా ప్రపంచంలోనే అత్యుత్తమంగా ఉంటుందని నేను నమ్ముతున్నానని అన్నారు. ఇందులో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ నటిస్తున్నారు. సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ కనిపించనున్నారు. హనుమంతుడిగా సన్నీ దేవోల్, కెకేయిగా లారా దత్తా, శూర్పణఖగా రకుల్ ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. రెండు పార్టులుగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. 2026 దీపావళికి మొదటి భాగం, 2027 దీపావళికి రెండో పార్ట్ విడుదల కానుంది.



# నానితో రష్మిక నో

హీరోల కెరీర్ విషయంలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. దానికి బిగ్ ఎగ్జాంపుల్ హీరో నాని.. ముందు అసిస్టెంట్ డైరెక్టర్‌గా వర్క్ చేసి 'అష్టాచమ్మా' సినిమాతో తెలుగు ఇండస్ట్రీలో హీరోగా ఎంట్రీ ఇచ్చారు. కానీ నాని హీరోగా ట్రై చేస్తున్నా సమయంలో చాలా అవమానాలు ఎదుర్కొన్నారట. నువ్వు ఇండస్ట్రీలోకి సెట్ కావు.. నీ ఫేస్‌కి అంత సీన్ లేదు.. ఇలా రకరకాలుగా మాట్లాడారట. అంతేకాదు నాని ఇండస్ట్రీల్రో హీరోగా సెటిల్ అయ్యి, హిట్స్ కొట్టిన తర్వాత కూడా చాలామంది హీరోయిన్లు ఆయనతో నటించాడిని నిరాకరించారట. ఇక ఓ హీరోయిన్ అయితే నానికి ఏకంగా మూడు సార్లు రిజెక్ట్ చేసిందట.ఇంతకి ఆ హీరోయిన్ మరెవరో కాదు..రష్మిక మందన్నా. హా.. నేషనల్ క్రష్ గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న రష్మిక నాని తో మూడుసార్లు సినిమా చేసే అవకాశం దక్కించుకుందట. కానీ మూడు సార్లు ఆమె ఆ సినిమా రిజెక్ట్ చేసిందట. ఇందులో ఎంత వరకు నిజం ఉందో తెలియదు కానీ, సోషల్ మీడియాలో ఈ న్యూస్ బాగా వైరల్ అవుతోంది.


ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

**విలేకరులు కావలెను**

రెండు తెలుగు రాష్ట్రాల్లో వెలువడుతున్న తెలుగు దినపత్రిక ప్రజానావలో పని చేయుటకు మా సంస్థ ఆహ్వానం పలుకుతోంది

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని మండలాల్లో, పట్టణంలో పనిచేయుటకు విలేకరులు కావలెను.

మండలాల్లో, అర్బన్, పట్టణ కేంద్రాల్లో పనిచేసే వారికి కనీస అర్హత ఇంటర్మీడియట్

స్టాఫ్ రిపోర్టర్, ఆర్‌సీ ఇన్‌చార్జీలకు కనీస అర్హత డిగ్రీ ఉండాలి

నోట్: 'ప్రజానావ' సంస్థ పేరుతో ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే యాజమాన్యం దృష్టికి తీసుకొస్తే కఠినచర్యలు తీసుకుంటాం

9676667020, 7288825681








Printed, Published and Owned by **Adula Thirupathi,** and Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, and Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi. RNI NO : TELTEL/2023/87657** Email: prajanaava@gmail.com. Phone No: **99484 33277.**